సాక్షి 24/7
వైఎస్సార్ జిల్లా
మంగళవారం 1-8-2017



సుధీర్ రెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జమ్మలమడుగు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.వెంకటరామిరెడ్డి

16లో

ఖరీఫ్ ఖాళీ


- పంట సాగుపై ఆసక్తి చూపని రైతులు
- తెగుళ్లను తట్టుకునే రకాలు అందుబాటులో లేని వైనం
- పడిపోయిన వరి, కంది, పెసర, మినుము, పత్తి విస్తీర్ణం

ముఖ్యమైన వివరాలు :

- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం **1.36** లక్షల హెక్టార్లు
- ఇప్పటి వరకు సాగైన పంటల విస్తీర్ణం **22** వేల హెక్టార్లు
- ప్రధాన పంట వేరుశనగ సాధారణ సాగు **36,575** హెక్టార్లు
- ఇప్పటికి సాగైన వేరుశనగ పంట **9,703** హెక్టార్లు
- జూన్, జూలై నెలల సాధారణ వర్షపాతం **165.9** మిల్లీ మీటర్లు
- రెండు నెలలకుగాను కురిసిన వర్షం **128.9** మిల్లీ మీటర్లు

వేరుశనగ, జొన్న, సజ్జ, కంది పంటలను సాగు చేసినా పశువుల మేత తప్ప దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వాతావరణశాఖ ఈ ఏడాది పంటలకు అవసరమైన వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఆకాశం మేఘావృతం అవుతున్నా జల్లులు తప్ప పదునుపాటి వర్షాలు కురవలేదు. ఇప్పటికే రెండు నెలల సాగు సమయం గడిచిపోయింది. వ్యవసాయశాఖ పంటల సాగుపై వేసిన అంచనాలు కూడా తగ్గిపోయాయి. దీనికితోడు తెగుళ్లను తట్టుకునే రకాలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు తెప్పించలేకపోవడంతో పంటల సాగుకు పూనుకోలేదని రైతుసంఘాలు అంటున్నాయి.

2లో



రాయచోటి మండలం బండపల్లె వద్ద ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

జిల్లాలో సాగైన పంటల వివరాలు..

పంటలు	సాధారణసాగు (హెక్టార్లలో)	సాగైన పంటలు (హెక్టార్లలో)
వరి	36,207	1,782
జొన్న	4,639	46
సజ్జ	2,434	707
మొక్కజొన్న	525	164
రాగి	13	10
ఇతర		
చిరుధాన్యాలు	1,050	53
కంది	9,286	538
పెసర	1,198	61
మినుము	1,709	707
అలసంద, ఇతర		
పప్పుధాన్యాలు	1,212	11
వేరుశనగ	36,575	9,703
పొద్దుతిరుగుడు	1,190	150
ఆముదం	1,112	39
సోయాబిన్, ఇతర		
నూనె గింజలు	78	06
ఎర్రమిరప	930	77
చెరకు	443	97
పత్తి	29,771	8,405
పసుపు	4,058	183
ఉల్లి	3,067	65

అన్నా.. అమ్మకు ఎంత కష్టం.!



- జిల్లాలో 3621 అంగన్‌వాడీ కేంద్రాలు
- 46 వేల మంది బాలింతలు, గర్భిణులు
- ఈ కేంద్రాల్లో రేషన్ బియ్యం భోజనం వడ్డించడంపై అనాసక్తత
- అంగన్‌వాడీల్లో కుర్చీలు, బెంచీలు లేక అవస్థలు పడుతున్న మహిళలు
- కార్యకర్తలపై కూరగాయల ధరల భారం
- అన్న అమృతహస్తం పథకం అమలులో ఎన్నో అవస్థలు

పట్టణ ప్రాంతాల్లో అన్న అమృతహస్తం పథకం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. మధ్యాహ్న భోజనం పట్ల బాలింతలు, గర్భిణుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రేషన్ బియ్యంతో తయారు చేసిన భోజనాన్ని తినేందుకు వారు విముఖత చూపుతున్నారు. భోజనం తయారీ అంగన్‌వాడీ సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతోంది. కూరగాయల కొనుగోలుకు ప్రభుత్వం అందించే సాయం సరిపోకపోవడంతో సతమతమవుతున్నారు.

10లో

కదం తొక్కారు..



జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా ప్రైవేటు విద్యాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి కడపకు చేరుకున్న అన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

16లో



మెరుపు దాడి

సుండుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నగదును జప్తు చేస్తున్న అవినీతి నిరోధకశాఖ అధికారులు

2లో

నత్తనడక

- సాగుతున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ
- వెనుదిరిగిన 300 మంది ఉపాధ్యాయులు
- నేడు 1301 నుంచి 2500 వరకూ



అర్ధరాత్రి టీచర్ల అవస్థలు (ఇన్‌సెట్) ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీఈఓ శైలజ

కడప ఎడ్యుకేషన్:

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కౌనెల్సింగ్ ప్రక్రియ ప్రారంభించి 11 రోజులు దాటినా ఉపాధ్యాయులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆదేశించడం తీరా వచ్చిన తర్వాత కొంతమందికి వాయిదా వేయడం సర్వసాధారణంగా మారింది.

ఉదయం 8 గంటలకే

సోమవారం కౌన్సెలింగ్‌కు 11 వందల మంది ఉపాధ్యాయులు హాజరు కావాలని డీఈఓ శైలజ ఆదేశించారు. ఆదివారం కూడా 15 వందల సంఖ్య వరకూ కౌన్సెలింగ్ ఉంటుందని మొదట అధికారులు చెప్పినా వెబ్‌సైట్ సరిగా పనిచేయక కౌన్సెలింగ్ నెమ్మదిగా సాగుతుండటంతో మళ్లీ విద్యాశాఖాధికారులు 7 వందల వరకు మాత్రమే ఉండాలని మిగతా వారంతా వెళ్లాలని సూచించారు. ఈ కౌన్సెలింగ్ రాత్రి పొద్దుపోయే వరకు సాగినా రాత్రి 6 వందల వరకు మాత్రమే కొసాగించారు. తిరిగి సోమవారం 601 నెంబర్ నుంచి ప్రారంభించారు. సోమవారం 17 వందల నెంబర్ వరకూ కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పినా తరువాత 13 వందల వరకు ఉండాలని మిగతా వారంతా వెళ్లాలని సూచించారు. ఈ కౌన్సెలింగ్ సోమవారం రాత్రి 7 గంటలకు కూడా 850 వరకు మాత్రమే జరిగింది. మిగతా వారికి రాత్రి పొద్దుపోయే వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో డీఈఓ పొన్నతోట శైలజ, డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఎంఈఓలు ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, పాలెం నారాయణతోపాటు పలువురు డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌లో

మంగళవారం నిర్వహించనున్న ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌కు సంబంధించి 1301 నుంచి 2500 వందల వరకు హాజరుకావాలని డీఈఓ పొన్నతోట శైలజ తెలిపారు.

ఖరీఫ్ ఖాళీ



చింతకొమ్మదిన్నె మండలం గొర్లపల్లె వద్ద సాగైన పత్తి పంటలో అంతర కృషి చేస్తున్న రైతు

కడప అగ్రికల్చర్ :

ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటల సాగు కాలం ముగిసింది. ఒడిదుడుకుల ప్రకృతితో రైతన్నలు పంటల సాగుకు పెద్దగా మక్కువ చూపలేదు. ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభమైనప్పుడు అరకొర పదును వర్షాలు కురిశాయి. దీంతో కొందరు రైతులు ప్రధాన పంటలను కొద్దిమేర సాగు చేశారు.తర్వాత మళ్లీ జూలై నెల రెండవ వారంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటి నుంచి ఇప్పటి వాన జాడ లేదని, దీంతో పంటల సాగుకు పూనుకోలేదని రైతులు చెబుతున్నారు.

1,36,673 హెక్టార్ల భూమికి... 22,840 హెక్టార్లలోనే సాగు

జిల్లాలో ప్రధానంగా వరి, వేరుశనగ, పత్తి, కంది, సజ్జ, జొన్న, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము పంటలను సాగు చేస్తారు. జిల్లాలో మొత్తం 1,36,673 హెక్టార్ల భూమిలో అన్ని ర కాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. అయి తే ఇప్పటి వరకు జిల్లాలో 22,840 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.

1782 హెక్టార్లలోనే వరి పంట

జిల్లాలో ప్రధాన పంట వరి. కేసీ కెనాల్ కింద 91,970 ఎకరాల్లో సాగవుతుంది. ఈ పంట పూర్తిగా శ్రీశైలం ప్రాజెక్టు నీటి మీదనే ఆధారపడి ఉంటుంది. అయితే కడప–కర్నూలు ప్రధాన కాలువకు సాగు నీరు రాకపోవడంతో వరి సాగు లేకుండా పోయింది. కొంతమంది రైతులు తిండి గింజల కోసం నీటి వనరులున్న బోరు బావులు, నదీ తీరప్రాంతాలు, చెరువుల కింద కలిపి 1782 హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి.


భయపెడుతున్న పప్పుధాన్యాల సాగు

ఒకప్పుడు పప్పు ధాన్యాల సాగు బాగా పెరుగుతూ వచ్చేది. అయితే కంది, పెసర, మినుము పంటలను సాగు చేసినప్పుడల్లా ఎల్లో మొజాయిక్ తెగులు విజృంభిస్తుండడంతో రైతులు వీటిని సాగు చేయలేక పోతున్నారు. పెట్టుబడి పెరుగుతుండడం, తెగుళ్లు, పురుగులు పంటపై దాడి చేస్తుండడంతో రైతులు వాటిని నిర్మూలించుకునే శక్తిలేక ఆయా పంటల సాగును పూర్తి స్థాయిలో చేపట్టలేక వదిలేస్తున్నారు.

తెగుళ్లు బెడద

గత ఏడాది అదునుదాటిన తర్వాత పప్పుధాన్యాలను సాగు చేసినప్పుడు తెగుళ్లను నిర్మూలించుకోవడానికి రైతులకు తల ప్రాణం తోకకొచ్చిందని చెబుతున్నారు. కొందరు శాస్త్రవేత్తలు వారి ఉద్యోగాలను కాపాడుకునేందుకు క్షేత్రపంటలను రైతులతో సాగు చేయిస్తున్నా, తర్వాత వాటి ఫలితాలు ఏమయ్యాయో...ఆయా విత్తనాలు ఎవరికి ఇచ్చి సాగును ప్రోత్సహిస్తున్నారో అంతుబట్టని రహస్యంగా ఉంది. కేవలం జెడ్‌ఆర్ ఏసీ, జిల్లా సాంకేతిక సలహా మండలి సమావేశాల్లో ఏటా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వారి ఉన్నతస్థాయి శాస్త్రవేత్తల ఎదుట గొప్పగా చెప్పుకుంటున్నారేగాని ఆ తరువాతి సంవత్సరాల్లో ఆయా పంటలు సాగు చేయించారా? ఒకవేళ చేయిస్తే ఎంత మందికి విత్తనాలు ఇచ్చి విత్తనోత్పత్తి కోసం ప్రోత్సహించింది చెప్పడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు.

కరువు పరిస్థితులు కనబడుతున్నాయి



ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు గడిచినా ఇప్పటికీ ఏ చెరువుకు నీరు చేరలేదు. ఏ కుంటా నిండలేదు. కాసిన్ని తిండి గింజలు పండించుకుందామంటే కేసీకి నీరు వచ్చే పరిస్థితులు కనిపించలేదు. శ్రీశైలం ప్రాజెక్టు పై భాగాన వర్షాలు కురవలేదు. వరి సాగు గగనమే. చినుకు పడితేనే మెతుకు. లేదంటే దుర్భరమైన బతుకు ఉంటుంది.

– చెన్నయ్య, రైతు పాలెంపల్లె, కడప నగరం

ప్రధాన పంటకు అదును పోయింది..



మేం ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తాం. పదును పాటి వర్షాలు మా మండలంలో కురవ లేదు. దీంతో ప్రధాన పంటను చాలా మంది రైతులు సాగు చేయలేకపోయారు. పదును పాటి వర్షాలు అక్కడక్కడా కురుస్తున్నా మాకు మాత్రం తుంపర జల్లులే. అదును పోయింది. మినుము, పెసర పంటలు వేసుకోవాల్సి వస్తోంది.

– శ్రీనివాసులరెడ్డి, రైతు వి.కొత్తపల్లె, వేముల మండలం

ఇక ప్రత్యామ్నాయ పంటలే..



జిల్లాలో ప్రధాన పంటల సాగుకు సీజన్ ముగిసింది. ఇక ప్రత్యామ్నాయ పంటల సాగే శరణ్యం. సజ్జ, అలసంద, జొన్న, ఉలవ, పెసర, మినుము పంటల సాగుకు ప్రణాళికలు తయారు చేశాం. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ పంటలు సాగు చేసుకోవచ్చు.

– డి.ఠాకూర్ నాయక్, సంయుక్త సంచాలకులు, జిల్లా వ్యవసాయశాఖ

సుండుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ నాగరాజు

సుండుపల్లి: సుండుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ సుండుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లో ఫీజు కింద దస్తావేజు రైటర్లు అధిక మొత్తంలో లంచా లు వసూలు చేసి రిజిస్ట్రేషన్ అనంతరం ఎఫ్‌ఆర్‌ఓ ముట్టచెప్పినట్లు తమ దృష్టికి ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యాలయానికి సంబంధించిన ఎనిమిది మంది దస్తావేజు రైటర్లు, అలాగే పాముల సుబ్రమణ్యం అనే వ్యక్తి ద్వారా ఇక్క డి కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తమ దగ్గర సమాచారం ఉండటంతో ఈ దాడులు చేశామని వివరించారు. అలాగే దస్తావేజు రైటర్ల వద్ద అధిక మొత్తంలో నగదు ఉందన్నారు. ఈ దాడుల్లో రూ.66వేలు నగదు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పట్లో డిజిటల్ పద్ధతిలో చలానా, డీడీ రూపంలో నగదు ఉండాలన్నారు. ఇందుకు భిన్నంగా ఇంత పెద్ద మొత్తంలో దస్తావేజు రైటర్ల వద్ద డబ్బులు ఉండటంతో సీజ్ చేశామన్నారు. అలాగే స్టాంప్ వెండర్ల వద్ద కూడా ఎంత మొత్తం ఉండాలో అంతే ఉండాలే తప్పా ఎక్కువ ఉండకూడదన్నారు. అవినీ తికి పాల్పడిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఏసీబీ అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పరిశీలించారు. ఈ నేపథ్యంలో 8 మంది దస్తావేజు రైటర్లు, మరో ప్రైవేటు వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా లంచం అడిగినా, ఇబ్బంది పెట్టినా అవినీతి నిరోధ కశాఖ డీఎస్పీ 94404 46111, సీఐ 9440446100, 94404 46124 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధక శాఖ సీఐలు రామచంద్ర, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టా శ్రీరంగనాథ్‌కు అవార్డు ప్రదానం




అవార్డు అందుకుంటున్న పుట్టా శ్రీరంగనాథ్

కడప కల్చరల్ : ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ ప్రమోషన్‌కు సంబంధించి కన్‌ఫ్యూయన్స్ స్టార్ అవార్డు–2017 కడప నగరానికి చెందిన పుట్టా యాడ్స్ ప్రతినిధి పుట్టా శ్రీరంగనాథ్‌కు లభించింది. దక్షిణ భారతదేశంలో మ్యూచువల్ ఫండ్స్ అన్ని కంపెనీలలో ఏఎంసీలలో సిప్ ద్వారా మదుపరులతో అధిక పెట్టుబడులు రాబట్టి ఫైనాన్షియల్ అడ్వయిజర్లలో టాపర్‌గా ఎన్నికైన పుట్టా శ్రీరంగనాథ్‌కు ఈ అవార్డు అందజేశారు. గత ఆదివారం గోవాలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్‌బీఐ సీఈఓ నుంచి ఈ అవార్డును అందుకున్నారు. సిప్ ద్వారా ప్రతినెల క్రమం తప్పకుండా అన్ని కంపెనీలలో ఫండింగ్ చేయించినందుకు రాష్ట్రానికి చెందిన పుట్టా సంస్థ టాప్ రేంజ్‌లో నిలిచిందని వారు ప్రశంసించారు.

గ్రానైట్ పేరుతో కొండలు పిండి

- అనుమతించిన విస్తీర్ణం కంటే ఎక్కువగా తవ్వకాలు
- అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే
- విజిలెన్స్ తనిఖీల్లో పెనాల్టీ చెల్లింపులు చేసిన కాంట్రాక్టర్లు


గ్రానైట్ తవ్వకాలు చేస్తున్న వండాడి కొండ


గ్రానైట్‌ను రవాణాకు సిద్ధం చేస్తున్న దృశ్యం

రాయచోటి రూరల్:

గ్రానైట్ తవ్వకాల్లో భాగంగా పలు చోట్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా కొండలను పిండి చేస్తున్నారు. మైనింగ్ అధికారుల పర్యవేక్షణ కరువవడంతో లైసెన్స్‌లు పొందిన కాంట్రాక్టర్లు గ్రానైట్ రాళ్ల తయారీ, తరలింపులో రాత్రి పగళ్లు పూర్తిగా నిమగ్నమైపోయారు. దీంతో కోట్ల రూపాయలు ప్రభుత్వ రాబడికి గండిపడుతోంది. రాయచోటి నియోజకవర్గంలోని పలు మండలాల పరిధిలోని పర్వతాల్లాంటి కొండపై కన్నేసిన కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించి కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. చిన్నమండెం మండల పరిధిలోని వండాడి కొండపైన లైసెన్స్‌లు దక్కించుకున్న మూడు కంపెనీలు తవ్వకాలు చేసి, గ్రానైట్ సిద్ధం చేస్తున్నాయి. ఒక వండాడి కొండలోనే సింహా గ్రానైట్ కంపెనీ కాంట్రాక్టర్–1, సుహాసిని గ్రానైట్ కంపెనీ–1, సీటీపీ గ్రానైట్ కంపెనీ–2 చోట్ల మొత్తం సుమారు 35 హెక్టార్ల విస్తీర్ణంలో పనులు దక్కించుకున్నాయి. అందులో రెండు గత ఏడాదిగా పనులు చేసి, గ్రానైట్ తరలించాయి. ప్రస్తుతం మరో కంపెనీ పనులు ముమ్మరం చేస్తోంది. అయితే వారంతా అనుమతులు పొందిన విస్తీర్ణం కంటే ఎక్కువగా చేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది హెక్టారుకు సుమారు లక్ష రూపాయల వరకు లైసెన్స్ పన్నులు చెల్లించాల్సింది. అలాగే తయారు చేసుకున్న గ్రానైట్‌ను వాటి పరిమాణాన్ని బట్టి కూడా క్యూబిక్ మీటర్‌కు రూ.2000–2350లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అలా గాకుండా అక్రమంగా కూడా గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల గ్రానైట్ తరలింపులో తప్పుడు పత్రాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు కాంట్రాక్టర్‌కు పెనాల్టీ వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంట్రాక్టరు రూ.50వేలు పెనాల్టీ కూడా చెల్లించినట్లు తెలిసింది.

అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం

గ్రానైట్ కాంట్రాక్టర్లు అక్రమంగా గ్రానైట్‌ను తరలించినా, లేదా అనుమతి ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువగా పనులు చేసినా తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇటీవల కూడా ఒక కంపెనీ చేసిన అక్రమ గ్రానైట్ రవాణాకు కూడా పెనాల్టీ విధించాం. ప్రస్తుతం కేవలం ఒక కంపెనీ మాత్రమే పనులు చేస్తోంది. మిగిలిన రెండు కంపెనీలు పనులు ఆపేశాయి. పనులను పర్యవేక్షణ చేస్తున్నాం.

ఉమామహేశ్వర్‌రెడ్డి, మైనింగ్ ఏడీ

అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే

గ్రానైట్ కోసం జరుగుతున్న పనులను సంబంధిత మైనింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే రాయచోటి నియోజకవర్గంలో జరుగుతున్న గ్రానైట్ పనుల పర్యవేక్షణలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రానైట్ పనులు జరిగేటప్పుడు కానీ, తరలించే సమయంలో అధికారులు లేకపోవడంతోనే కాంట్రాక్టర్లు అక్రమ తరలింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు

పుల్లంపేట: కడప–చెన్నై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఉడుమవారిపల్లె గ్రామానికి చెందిన చెంగల్‌రెడ్డి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కెఎ–డి–8528 నెంబరుగల లారీ ఢీ కొంది. దీంతో వృద్ధుడి కాలు నుజ్జునుజ్జు అయింది. మెరుగైన వైద్యంకోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


పోలీసులను ఆశ్రయించిన శివప్రసన్న, భారతి

రాజంపేట రూరల్: గుంటూరు నలంద కళాశాల్లో కలిసి చదువుకున్న రెడ్డిచర్ల శివప్రసన్న, వి.నాగలక్ష్మి భారతి అనే ప్రేమ జంట సోమవారం రాజంపేట డీఎస్పీ రాజేంద్రను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే... కడప జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన యానాదయ్య కుమారుడు శివప్రసన్న 2013 నుంచి 2017వ సంవత్సరం వరకు గుంటూరులోని నలందా కళాశాలలో చదువుకున్నాడు. అదే కళాశాల్లో గుంటూరు మండలం ఏజీ అగ్రహారానికి చెందిన వి.సుబ్బరాయశాస్త్రి కుమార్తె భారతి 2015వ సంవత్సరంలో గుంటూరు నలంద కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరింది. ఇదే క్రమంలో వీరిద్దరికీ పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అనంతరం శివప్రసన్న హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ ఉండగా భారతి తన తల్లిదండ్రులు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఇంటిలోనుంచి పారిపోయివచ్చి శివప్రసన్నతో ఆంజనేయస్వామి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. భారతి తల్లిదండ్రుల నుంచి శివప్రసన్నకు, భారతికి బెదిరింపులు రావడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్ర మాట్లాడుతూ ప్రేమజంటకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

దొంగ అరెస్టు

– 28 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

కడప అర్బన్ : కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో నాలుగు రోడ్ల కూడలి వద్ద బంగారు అమ్మేందుకు వెళుతున్న పాత నేరస్తుడు బత్తల హరికృష్ణ అలియాస్ హరి (20)ని వన్‌టౌన్‌సీఐ టీవీ సత్యనారాయణ తమ సిబ్బందితో సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి వివిధ దొంగతనాల్లో దోచుకున్న 28.87 గ్రాముల బంగారు ఆభరణాలను, 164.300 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో ఎస్ఐ ఆర్ఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఆరు నెలలు జైలు

సిద్దవటం: మండలంలోని లింగంపల్లె గ్రామానికి చెందిన నంబోలా చిన్నచెన్నయ్య అనే వ్యక్తికి ఘర్షణ కేసులో సిద్దవటం కోర్టు జడ్జి రాజశేఖర్ ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 3 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని ఏఎస్ఐ చెన్నయ్య తెలిపారు. మండలంలోని లింగంపల్లె గ్రామంలో 13 ఆగస్టు 2016 లో స్థానికంగా ఉన్న దేవాలయం వద్ద నంబోలా చిన్న చెన్నయ్య చెప్పులు విడిచి ఆలయంలోకి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికే చెప్పులు కనపడలేదు. అదే గ్రామానికి చెందిన ఉప్పల పాటి సుబ్బయ్య చిన్న చెన్నయ్య చెప్పులు వేసుకొని ఇంటికి వచ్చారు. చెప్పులను చూసిన చెన్నయ్య ఏమిరా.. నా చెప్పులు వేసుకుని వచ్చావు, కళ్ళు కనిపించలేదా.. అని తిట్టడంతో సుబ్బయ్య కుమారుడు శివ పోనీ..లేవయ్యా తెలియక వేసుకొచ్చాడని చెప్పాడు. దీంతో మీ నాయనకే సపోర్టు వస్తున్నావా.. అని చెన్నయ్య చేతిలో ఉన్న కట్టెతో శివ తలపై కొట్టాడు. దీంతో శివకు గాయాలయ్యాయి. అప్పట్లో చెన్నయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన తరువాత జడ్జి రాజశేఖర్ చిన్నచెన్నయ్యదే తప్పు అని, అతనికి 6 నెలలు జైలు శిక్ష, రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి


ఆటోలో ఇరుక్కుపోయి చికిత్స పొందుతూ మృతి చెందిన వెంకటేశ్వరరాజు

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారి రాజంపేట మండలం ఎస్.ఎర్రపల్లె(ఎంపీప కార్యాలయం సమీపంలో)వద్ద కడప నుంచి లోడ్‌తో వస్తున్న టాటా ఏసీఈ వాహనం ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే...కడప వైపు వెళుతున్న లారీ సరిగ్గా ఎర్రపల్లె సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న టాటాఏసీఈ వాహనం మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఢీ కొంది. ఢీకొన్న వాహనం ముందు భాగంగా నుజ్జు నుజ్జు అయింది. అందులో ఉన్న డ్రైవర్ మల్లారెడ్డి, తాళ్లపాకకు చెందిన వెంకటేశ్వరరాజుకు గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గాయపడ్డ ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరాజును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

స్తంభించిన ట్రాఫిక్

ఎస్.ఎర్రపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంతో నేషనల్‌హైవేలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాలు బారులు తీరాయి. అదే మార్గంలో ఉన్న డెమోకారిడార్ పెట్రోలింగ్ సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. ట్రాఫిక్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న రాజంపేట డీఎస్పీ రాజేంద్ర, రూరల్ సీఐ మురళీ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటనకు సంబంధించి కారణాలు, మృతి చెందిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ఆరా తీశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట రూరల్ ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.

దోపిడీ కేసులో భార్యాభర్తల అరెస్ట్

- రూ. 1,10,000 విలువైన 55 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో కడప సీసీఎస్ డిఎస్పీ నాగేశ్వర్ రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 13న నబీకోటలో పట్టపగలు 2 గంటల సమయంలో ఓ ఇంటిలోకి ప్రవేశించి జ్యోతి అనే ఒంటరి మహిళపై దాడి చేసి బంగారు ఆభరణాలను దోపిడీ చేసుకుని వెళ్లిన భార్యాభర్తలను బిల్టప్ సమీపంలో అరెస్ట్ చేసినట్లు కడప సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కడప సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం, కలుగోట్లపల్లి గ్రామానికి చెందిన గాలిపోతుల రాజేష్ అలియాస్ శేఖర్ (45), అదే జిల్లా, మండలం, నారాయణపల్లి గ్రామానికి చెందిన గాలిపోతుల కళావతి అలియాస్ బుజ్జి (38) అనే ఇరువురు వివాహం చేసుకున్నప్పటి నుంచి కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని, వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 13న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వీరివురు నబీకోటలో జ్యోతి అనే బాధితురాలి ఇంట్లోకి దుస్తులు కొనడానికి ప్రవేశించి ఒంటరిగా ఉన్న ఆమెపై దాడి చేసి, గాయపర్చారు. ఆమె ఒంటిపై ఉన్న 55 గ్రాముల బంగారు నగలు, రూ. 3 వేలు నగదును దోపిడీ చేసి వెళ్లారు. ఈ సంఘటనపై కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్ రెడ్డి, తాలూకా ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి నిందితులను ఇరువురిని అరెస్ట్ చేశారని సీఐ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి బంగారు చైన్, గాజు, ఉంగరం అన్నీ కలిపి 55 గ్రాముల బరువు, విలువ రూ. 1,10,000 ఉంటుందన్నారు. సమావేశంలో కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, సిబ్బంది ప్రకాష్, మురళీయాదవ్, మల్లయ్య, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలి విచారణలో ఇచ్చిన క్లూతోనే.....

ఈ దోపిడీలో బాధితురాలిని పోలీసులు విచారించిన సమయంలో నిందితుల గురించి 'క్లూ' దొరికింది. నిందితులు భార్య,భర్త మాదిరిగా చీరలు కొనుగోలు చేసేందుకు వచ్చారని తెలిపింది. అంతకు ముందు ఎవరితోనైనా వచ్చారా ? అని ప్రశ్నించగా, మొదట వేరే మహిళతో, నిందితురాలైన మహిళ వచ్చిందని, తర్వాత భార్యాభర్త వచ్చారని, మూడోసారి ఇరువురు వచ్చి ఈ దోపిడీకి పాల్పడ్డారని తెలిపింది. మహిళలతో వచ్చిన సమయంలో ఎవరెవరితో వచ్చింది గుర్తుకు తెచ్చుకుని చెప్పాలని వారు సూచించారు. ఆమె ఇచ్చిన సమాచారంతో నిందితులకోసం గాలించి, అరెస్ట్ చేయగలిగారు.

భవిష్యం

మేషం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువిరోధాలు. శ్రమాధిక్యం. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలు గందరగోళంగా ఉంటాయి.

వృషభం: పలుకుబడి పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. వస్తు, వస్త్రలాభాలు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.



మిథునం: మిత్రులతో సఖ్యత. విందువినోదాలు. ఆలయాలు సందర్శిస్తారు. పనులు సకాలంలో పూర్తి. సంఘంలో ఆదరణ. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితి.

కర్కాటకం: శ్రమ పెరుగుతుంది. పనుల్లో ఆటంకాలు. అనుకోని ఖర్చులు. దూరప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: మిత్రులతో విభేదాలు. ఆరోగ్య భంగం. పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

కన్య: దూరపు బంధువుల కలయిక. విందువినోదాలు. కార్యసిద్ధి. పరిచయాలు పెరుగుతాయి. ఆస్తి లాభాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో పురోగతి.

తుల: రుణాలు చేస్తారు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. బంధువర్గంతో విభేదాలు. ఆలోచనలు కలసిరావు. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. వాహనసౌఖ్యం. ఉత్సాహంగా పనులు పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహం.

ధనుస్సు: మిత్రులతో అకారణంగా విరోధాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. బాధ్యతలు పెరుగుతాయి. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

మకరం: పరిచయాలు పెరుగుతాయి. ఆశయాలు నెరవేరతాయి. ఆకస్మిక ధనలాభం. బంధువుల తోడ్పాటు లభిస్తుంది. పనులు సకాలంలో పూర్తి. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: ఉద్యోగయోగం. కీలక నిర్ణయాలు. వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవదర్శనాలు. రుణఒత్తిడులు తొలగుతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

మీనం: రుణయత్నాలు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

– సింహంభట్ల సుబ్బారావు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రంగు గుడ్లు

- వారానికి ఒక రంగు నిర్ణయించిన ప్రభుత్వం
- పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట
- నేటి నుంచి అమలు చేయాలని నిర్ణయం



బద్వేలు:

పిల్లలను బడి వైపు ఆకర్షించడం, వారిలో పోషకాహర లోపం లేకుండా చేయడం, అక్షరాస్యత పెంపు తదితర కారణాలతో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగానే పిల్లల ఎదుగుదలకు సంబంధించి అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందించాలనే లక్ష్యంతో భోజనంతో పాటు కోడిగుడ్లు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదట్లో వారానికి రెండు, అనంతరం ఈ సంఖ్యను మూడుకు పెంచింది. వంట ఏజెన్సీలు పలు చోట్ల వారానికి ఒక గుడ్డు మాత్రమే ఇవ్వడం, తమకు గిట్టుబాటు కాలేదని సాకులు చెబుతూ పండో, పాయసంతోనే సరిపెడుతుండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఈ నేపథ్యంలో గుడ్ల పంపిణీలో లోసుగులు నివారించేందుకు రంగులు వేసిన గుడ్లను విద్యార్థులకు అందజేయాలని నిర్ణయించింది.

వారానికి ఏడు లక్షలపైనే...

జిల్లాలో 3,249 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిద తరగతి వరకు 1,60,617 మంది విద్యార్థులు ఉన్నారు. 863 ఉన్నత పాఠశాలల్లో మరో 80 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వారానికి మూడు వంతున దాదాపు ఏడు లక్షల వరకు గుడ్లు అవసరమవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రోజుకు రూ.6.48, ఉన్నత పాఠశాల విద్యారిథకి రూ.8.53 వంతన చెల్లిస్తున్నారు. గుడ్డు ఇచ్చిన రోజు విద్యార్థి మెస్ చార్జీ నుంచి రూ.2.35 చొప్పున తగ్గించి సరఫరా ఏజెన్సీకి చెల్లిస్తారు.

రంగులు ఇలా..

మొదటి వారం సరఫరా చేసే గుడ్లకు పసుపుపచ్చ రంగు(ఎల్లో) నిర్ణయించారు. రెండో వారంలో ఆకుపచ్చ(గ్రీన్), మూడో వారం నీలిరంగు(బ్లూ), నాలుగో వారం ఎరుపు రంగు (రెడ్), ఐదో వారం చామన ఛాయ రంగు గుడ్లను అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

నిరంతర పర్యవేక్షణ

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్‌లో యాప్ ద్వారా ప్రతి వారం కావాల్సిన గుడ్ల ఇండెంట్‌ను ఎంఈఓ లేదా ప్రధానోపాధ్యాయులు ప్రారం భ, ముగింపు బ్యాలెన్స్ నమోదు చేయాలి. ఏజెన్సీ నుంచి గుడ్లు తీసుకున్నాక ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణపత్రం పొందాలి. దీనిపై ఎంఈఓ సంతకం తప్పనిసరిగా ఉండాలి.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఎస్‌ఎస్‌ఏలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేయుటకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు అధికారి పొన్నతోట శైలజ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఆగస్టు 5 తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప ఎన్‌జీఓ కాలనీలోని ఎస్‌ఎస్‌ఏ కార్యాలయలో సమర్పించాలన్నారు. సంబంధిత పోస్టుల వివరాలు, దరఖాస్తు ఫారాలు, గైడ్‌లైన్స్‌ను ఆయా మండలాల డిప్యూటీ ఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

రైతు రణభేరి పోస్టర్ల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 12న గుంటూరులో నిర్వహించనున్న రైతు రణభేరిని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ జీవీ సుబ్రమణ్యం, నగర కన్వీనర్ షేక్ అమీన్‌పీరా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో రైతు రణభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు చంద్రపాల్, అంకిత్‌కుమార్, షేక్ అరాఫత్ పాల్గొన్నారు.

4లోగా ఫీజు చెల్లించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో మొదటి సంవత్సరం డిగ్రీలో చేరేందుకు ఆగస్టు 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బనరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్ష అదే నెల 6న నిర్వహిస్తామన్నారు. ఇందుకుగాను చెల్లించే ఫీజును ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

- పీజీ, ఎంబీఏలో మొదటి, రెండవ, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆగష్టు 24లోగా ఆన్‌లైన్‌లో తమ టెన్త్, ఇంటర్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఫీజు చెల్లించాలని ఆయన కోరారు.
- చాయిస్ బేస్‌డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) ద్వారా సెమిస్టర్ పద్ధతిన మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో 40 పేపర్లు చదివి ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా మమత

కడప కల్చరల్ : స్టెప్ సీఈఓ మమత ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు చేపట్టారు. ఆ శాఖ పీడీ రాఘవరావు సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో కలెక్టర్ బాబూరావు నాయుడు ఆదేశాల మేరకు ఆమె ఐసీడీఎస్ పీడీగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఏఐటీఎస్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఏఐటీఎస్‌లో క్యాంపస్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట : ఏఐటీఎస్ (అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల)లో ఆది, సోమవారం రెండురోజుల పాటు హైదరాబాదు జీజీకే టెక్నాలజిస్ వారి ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. అన్నమాచార్య విద్యాసంస్థలకు నుంచి బీటెక్ (ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ) విద్యార్థులతో పాటు, ఎంసీఏ విద్యార్థులు హాజరయ్యారు. మందుగా ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించారు. ఇందులో నుంచి రెండవ రౌండ్‌కు 64 మంది అర్హతను సాధించారు. చివరిగా హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. ఇందులో 9 మంది విద్యార్థులు ఉద్యోగా లు సాధించారని టాలెంట్ అక్విజిషన్ హెడ్ సరిత, ఎగ్జిక్యూటివ్ టాలెంట్ అక్విజిషన్ ఆకాష్ తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్‌ఎం వీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ధృడ సంకల్పంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏదీలేదన్నారు. అనంతరం ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్రీనువాసరావు విద్యార్థులను అభినందించారు.

తిరుమల సమాచారం

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం వేచి ఉండే భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 23 కంపార్టుమెంట్లు నిండిపోయాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం:

గదుల వివరాలు:
ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

ఆర్జిత సేవల వివరాలు:
సహస్ర దీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

మంగళవారం ప్రత్యేక సేవ
అష్టదళపాదపద్మారాధన

వాతావరణం

రానున్న 24 గంటల్లో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. పశ్చిమ రాజస్థాన్, కచ్, ఉత్తర కర్ణాటక మినహా మిగిలిన ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

వైఎస్‌ఆర్ జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం
37.2°/25.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	31.0	27.8
కోల్‌కతా	34.2	27.2
బెంగళూరు	30.5	22.0
ముంబై	30.6	24.9
చెన్నై	35.8	27.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
గుంటూరు	37.2/26.0	ఏలూరు	34.6/25.2
కడప	37.2/25.0	రాజమండ్రి	34.6/25.2
ఒంగోలు	37.1/26.4	తాడేపల్లిగూడెం	34.6/25.2
ఖమ్మం	36.8/23.0	హైదరాబాద్	34.6/24.4
నల్లగొండ	36.4/27.0	రంగారెడ్డి	34.6/24.4
విజయవాడ	36.4/27.0	చిత్తూరు	34.6/24.1
అనంతపురం	36.0/25.2	తిరుపతి	34.6/24.1
కరీంనగర్	35.8/25.6	మహబూబ్‌నగర్	34.5/24.5
కాకినాడ	35.5/26.5	నెల్లూరు	34.0/26.0
కర్నూలు	35.1/25.7	ఆదిలాబాద్	33.8/23.0
శ్రీకాకుళం	35.1/25.5	నిజామాబాద్	33.5/24.9
విజయనగరం	35.1/25.5	మెదక్	33.5/22.6
వరంగల్	34.6/26.0	విశాఖపట్నం	33.0/25.2

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్‌స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
మ.12.30 న్యూస్ ఫీచర్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 పృథ్వీనారాయణ
ఉ.09.30 కె.డి. నం.1
మ.12.00 శ్రీరామచంద్రులు
మ.03.00 ఆయుధం
సా.06.00 ఘరానా మొగుడు
రా.09.00 ఆటోనగర్ సూర్య



స్టార్ గోల్డ్
ఉ.10.20 సనమ్ రే
మ.01.00 బాడీగార్డ్
మ.03.50 బడేమియా ఛోటేమియా
సా.06.55 మార్ మిటేంగే
రా.09.50 బజ్‌రంగీ భాయ్‌జాన్




హెచ్‌బీవో
మ.11.40 గ్రీస్
మ.01.39 కుంగ్‌ఫూ పాండా
మ.03.15 షావోలిన్ సాకర్
సా.05.00 జాస్ 2
రా.09.00 బ్యాట్‌మ్యాన్ వర్సస్ సూపర్‌మ్యాన్



స్టార్ మూవీస్
మ.01.06 ద లయన్ కింగ్
మ.02.53 ద ఇన్‌క్రెడిబుల్స్
రా.07.08 బాబిలోన్ ఎ.డి.
రా.09.00 బేబీస్ డేఔట్
రా.11.04 కమెండో




మా మూవీస్
ఉ.09.00 చంద్రలేఖ
మ.12.00 ధైర్యం
మ.03.00 కేరింత
సా.06.00 సూర్యవర్సస్ సూర్య
రా.09.00 143 ఐ మిస్ యు



జీ సినిమా
మ.12.10 హమారా దిల్ ఆప్‌కే పాస్ హై
మ.03.12 యమ్‌లోక్
సా.06.00 మైదాన్ ఇ జంగ్
రా.09.00 ఎన్‌కౌంటర్ శంకర్

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : కడప అర్బన్- దుర్గాప్రసాద్ : 98496 52908 అగ్రికల్చర్- ప్రభాకర్‌రెడ్డి : 97053 47653, సెవెన్ రోడ్స్- ఫణి : 91775 86087, కార్పొరేషన్- కిశోర్ : 98666 38987, కల్చరల్- పవన్ : 98855 06765, స్పోర్ట్స్- నాగరాజు: 9059851188, రూరల్- విశ్వప్రసాద్: 9705347649, ఎడ్యుకేషన్ - యల్లారెడ్డి : 8008003074 కోటిరెడ్డి సర్కిల్-జయరాజ్:9010278698, వైఎస్ఆర్ సర్కిల్- కొండయ్య : 9866930982



ధర చికెన్

శ్రావణమాసం ఎఫెక్ట్

కడప కార్పొరేషన్:

శ్రావణమాసం ఎఫెక్ట్ చికెన్ ధరపై పడింది. ఇన్నాళ్లు మాంసాహారులకు చుక్కలు చూపించిన ధర ఎట్టకేలకు చేతికి చిక్కింది. కడప మార్కెట్‌లో ఆదివారం కిలో చికెన్ రూ.125, స్కిన్‌లెస్ రూ.145గా అమ్మకాలు జరిగాయి. వారం క్రితం వరకూ కిలో చికెన్ సుమారు రూ.200గా ఉన్న చికెన్ ధర రూ.75ల మేర తగ్గడంతో మాంసాహారులు చికెన్ కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. దీంతో మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. గత వేసవికి ముందు చికెన్ ధర విపరీతంగా పెరిగి ఎన్నడూ లేనివిధంగా కిలో రూ.200 లకు పైగా ఎగబాకింది. దీంతో మాంసాహారులు చికెన్ కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేశారు. రెస్టారెంట్లు, హోటళ్లలో సైతం వంటకాల్లో చికెన్ వడ్డింపులు బాగా తగ్గాయి.



పెరిగిన కోళ్ల ఉత్పత్తి

వేసవిలో ఎండల దెబ్బకు కోళ్లను సంరక్షించడం కష్టంగా మారిన నేపథ్యంలో కోళ్ల ఉత్పత్తిని రైతులు బాగా తగ్గించారు. వర్షాకాలం రావడంతో రైతులు అధిక సంఖ్యలో కోళ్లను ఉత్పత్తి చేయడం మొదలు పెట్టారు. ఈ పరిస్థితి కూడా చికెన్ ధర తగ్గడానికి కారణమయ్యిందని తెలుస్తోంది. ఇక శ్రావణ మాసంలో చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో చికెన్ ధరలు తగ్గినట్లు చెబుతున్నారు.

ధరలు తగ్గడం మంచిదే

చికెన్ ధరలు తగ్గడం మంచిదే. చికెన్ రేట్లు పెరగడంతో రెండు వారాలుగా చికెన్ కొనడం కష్టమైంది. మటన్ చూస్తే కొనే పరిస్థితి లేదు. సామాన్యులకు అందుబాటులో ఉన్న చికెన్ ధర కూడా పెరిగితే మాలాంటి వారి పరిస్థితి ఏంకావాలి.

– ఓబులేసు, పాతకడప.

స్వచ్ఛపక్వాడాను విజయవంతం చేయాలి

వైవీయూ:

యోగివేమన విశ్వవిద్యాలయంలో స్వచ్ఛపక్వాడా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య కె. సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛపక్వాడా పేరుతో నిర్వహించే స్వచ్ఛతా కార్యక్రమాలను చక్కగా నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛప్రతిజ్ఞ మొదలు పరిసరాల పరిశుభ్రత, దత్తతు తీసుకున్న గ్రామాల్లో శుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. 14న స్వచ్ఛ ర్యాలీలను నిర్వహించాలన్నారు. ఆగస్టు 15వ తేదీన పరిశుభ్రమైన కళాశాలగా ప్రకటించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూలోని 9 ఎన్ఎస్ఎస్ యూనిట్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య గులాంతారీఖ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మధుసూదన్‌రెడ్డి, ఉస్మాన్‌బాషా, ఈశ్వర రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసగౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మంటను ఆర్పుతున్న హాస్పిటల్ ఏఓ తేజ

కడప అర్బన్ : కడప నగరంలోని తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం అగ్నిమాపక శాఖ కడప ఫైర్ స్టేషన్ అధికా రి నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ గురించి వివరిస్తూ విన్యాసాలను ప్రదర్శించారు. ఈ క్రమంలో మొదట ఆసుపత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో అవగాహన కల్పించారు. తర్వాత ప్రాక్టికల్‌గా ప్రదర్శించి చూపించారు. వంట గ్యాస్ సిలెండర్ ద్వారా సంభవించే ప్రమాదాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ ఏఓ తేజ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించినప్పడే గుర్తింపు



వెంకట రమణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న సీఐలు

కడప కార్పొరేషన్: ఉద్యోగ సమయంలో ఉత్తమ సేవలు అందించినపుడే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎక్సైజ్ సీఐలు జవహర్‌బాబు, తిరుపతయ్య, రమేష్, భూషణ్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి అన్నారు. పలమనేరులోని క్యాటిల్ ఫాం చెక్‌పోస్టులో ఎక్సైజ్ సీఐగా పని చేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వెంకట రమణారెడ్డికి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖకు వెంకట రమణారెడ్డి అందించిన సేవలు విలువైనవని చెప్పారు. అనంతరం వెంకట రమణారెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకాలు వేయిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

కడప కోటిరెడ్డి సర్కిల్ : 9 నెలలు మొదలుకుని 15 ఏళ్లలోపు పిల్లలందరికీ తట్టు–రుబెల్లా వ్యాధుల నివారణ టీకాను తప్పనిసరిగా వేయించాలని ఎన్‌సీసీ 30(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అంబరీష్ గులియ తెలిపారు. ఎన్‌సీసీ 30ఎ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం తట్టు–రుబెల్లా వ్యాధి నిరోధకర్యాలీని నిర్వహించారు.ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8వ తేది వరకు టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఈ టీకాను ఇప్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పురుషుల కళాశాల, ఎస్వీడీసీ, గాంధీనగర్ హైస్కూలు ఎన్‌సీసీ అధికారులు నీలయ్య, ఇమామ్ ఖాసిం, సిబ్బంది,క్యాడెట్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు అందించాలి

కడప వైఎస్సార్‌సర్కిల్ : జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలైన అర్హులందరికీ రుణాలు అందించాలని కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ మల్లెం విజయభాస్కర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హులైన వారికి ఎక్కడా సక్రమంగా రుణాలను అందించడం లేదన్నారు. పేరుకేమో ప్రజలకు రుణాలు అందిస్తున్నామని బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించడం ఏ ఒక్కరికీ రుణసౌకర్యాన్ని అందించిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పగిడాల పెద్దన్న, సుంకేసుల బాదుల్లా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

కడప సెవెన్‌రోడ్స్: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఆగస్టు 7వ తేది వరకు దీక్షలు కొనసాగించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు కేఎన్ రాజుమాదిగ తెలిపారు. ఏబీసీడీ వర్గీకరణపై ఎన్నికల్లో ఇచ్చిన హామీకి చంద్రబాబు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. అయితే ముఖ్యమంత్రి ఎన్నికల హామీని విస్మరించి తమను మోసగించారని ఆరోపించారు. ఇప్పటికైనా వర్గీకరణకు మద్దతు ప్రకటించాలన్నారు. ఆ సంఘం నాయకులు మాతయ్య, బాలు, జి.గోవర్ధన్, ఆర్.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : తమకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ మండలాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ కంప్యూటర్ ఆపరేటర్స్ సోమవారం డ్వామా పీడీ విజయ్ కుమార్‌కు వినతి పత్రమిచ్చారు. 2010 నుంచి దాదాపు రూ.3వేల జీతంతోనే కాలం గడుపుతున్నామని ప్రస్తుత పెరిగిన నిత్యావసర ధరలు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చే చాలీ చాలని వేతనం తమకు సరిపోవడం లేదన్నారు. అలాగే అటెండర్స్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.10వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది జయశ్రీ, రమేష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ జిల్లా | మంగళవారం | ఆగస్టు | 1 | 2017 సాక్షి

చంద్రబాబు హయాంలో ఆర్టీసీకి నష్టాలు

• వైఎస్సార్‌మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.రాజారెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఏ.రాజారెడ్డి

రాయచోటి రూరల్ : చంద్రబాబు హయాంలో ఆర్టీసీకి నష్టాలు, సంస్థలో పనిచేసే కార్మికులకు కష్టాలు తప్పలేదని వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటికి వచ్చిన ఆయన ఆర్టీసీలో ఉన్న పలు సమస్యలను ఎత్తి చూపారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీలో సర్వీసులు రద్దు చేస్తూ, బస్సులను తగ్గించడంతో కార్మికులపై పనిభారం పెరిగిపోతోందన్నారు. కొన్ని యూనియన్ల నాయకులతో కుమ్మక్కై ఆర్టీసీని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే గన్నవరంలో సుమారు రూ.1000 కోట్ల విలువైన భూములను, ఆస్తులను రాత్రికి రాత్రే లోకేష్‌బాబు హెచ్‌సీఎల్‌కు కట్టబెట్టడం దారుణమన్నారు. చంద్రబాబు హయాంలో నష్టాలు వస్తున్నాయనుకుంటే, ఆయన కొడుకు ఏకంగా ఆర్టీసీ ఆస్తులను కూడా లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో డిపో సెక్రటరీ శరత్‌బాబు నాయక్, ప్రెసిడెంట్ సుధాకర్, రీజనల్ వైస్ ప్రసిడెంట్ ఆర్‌ఎల్ నారాయణ, శంకరయ్య పాల్గొన్నారు.

నీరు-చెట్టు పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

తొండూరు : మండలానికి సంబంధించిన నీరు–చెట్టు పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. సోమవారం తొండూరులో ఇనగలూరు సర్పంచ్ సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ తాలూకా ప్రధాన కార్యదర్శి దశరథరామిరెడ్డిలు మాట్లాడుతూ ఇనగలూరు గ్రామంలోని రాజసేతు సాగర్‌లో మార్చి, ఏప్రిల్, మేలో వరంగల్‌కు చెందిన బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి వల్ల రైతులు భూముల్లో 30వేల ట్రిప్పుల పూడిక మట్టిని పొలాలకు తోలామన్నారు. దీంతో ఆ పనులు జరిగిన చోట తొండూరు మండల టీడీపీ నాయకుడు శివమోహన్‌రెడ్డితోపాటు అతని అనుచరుడు విష్ణుకంచిరెడ్డిలు నీరు – చెట్టు పనులు చేయడంతో అడ్డుకున్నామన్నారు. నీరు-చెట్టు పనులు జరిగే చోట మొగమూరు వాగును పరిశీలించాలని జేఈ కృపానిధిని, డీఈ వెంకటేశ్వర్లను కోరినా వారు పట్టించుకోలేదని తెలిపారు.

ఎస్సీల భూములపై నిర్లక్ష్యం తగదు

• మానవహక్కుల జిల్లా కన్వీనర్ జయశ్రీ


భూ సమస్యలపై తహసీల్దార్‌తో చర్చిస్తున్న జయశ్రీ

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన భూములపై కొందరు ఇబ్బందులు సృష్టిస్తున్నా అధికారులు చూస్తూ ఉండడం తగదని మానవహక్కుల జిల్లా కన్వీనర్ జయశ్రీ అన్నారు. సోమవారం ఆమె స్థానిక తహసీల్దార్‌తో ఎస్సీల భూ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సోమిరెడ్డిపల్లెకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన చెన్నమ్మ కు సుబ్బిరెడ్డికుంట దగ్గర ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని ఇచ్చింది. ఆ భూమిలను సాగు చేసుకోవాలనుకుంటే కొందరు గ్రామస్తులు అడ్డుపడుతున్నారని తెలిపారు. కుంట సమీపంలో ఉన్న భూమికి స్థానికులు దారి లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు ఎస్సీలకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

అభివృద్ధికి అడ్డుకట్ట

- బద్వేలు దేశంలో 'ఆసుపత్రి అభివృద్ధి కమిటీ' చిచ్చు
- జయరాములు సూచించిన ప్యానల్‌ను వ్యతిరేకించిన విజయమ్మ
- తాత్కాలికంగా వాయిదా వేస్తూ ఉత్తర్వులు
- అభివృద్ధికి అడ్డంకిగా మారిన నేతల మధ్య వైరం


బద్వేలు అర్బన్ :

బద్వేలు నియోజకవర్గం టీడీపీలో ఇన్‌చార్జి బాధ్యతలపై జరిగిన రచ్చ, మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిపై జరిగిన ఆందోళన మరవక ముందే తాజాగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటులో ఆ పార్టీ ముఖ్యనేతల మధ్య వైరం మరోసారి తేటతెల్లమైంది. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది టీడీపీలోకి మారిన జయరాములుకు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మలకు గత కొంత కాలంగా నీరు–చెట్టు పనుల కేటాయింపులో, వివిధ అభివృద్ధి పనుల కేటాయింపులో తీవ్రస్థాయిలో విబేధాలు పొడచూపాయి. ఇదే క్రమంలోనే ఇటీవల బద్వేలు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటులో కూడా ఇరువురు నేతల మధ్య వైరం బహిర్గతమైంది. చివరకు అధికారులు చేసేది లేక కమిటీని తాత్కాలికంగా వాయిదా వేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

ప్రిస్టేజీగా మారిన వ్యవహారం

జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీని 2015 మేలో విడుదలైన జీఓ 48 ద్వారా ఒక చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు సభ్యులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే అందులో చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను కలెక్టర్ నియమించాల్సి ఉంది. అందులో కూడా స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు సూచించిన వారికి కలెక్టర్ ఆమోదం తెలిపి పేర్లను ప్రకటిస్తారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే జయరాములు బద్వేలు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా గానుగపెంట హనుమంతరావు, మెంబర్లుగా కోనపుల్లారెడ్డి, తుమ్మలూ రుసరస్వతి పేర్లను, ప్రతిపాదిస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో కలెక్టర్‌కు పంపించారు. ఆ మేరకు జూన్ 21వ తేదీన ఎమ్మెల్యే సూచించిన పేర్లకు ఆమో దం తెలుపుతూ కలెక్టర్ నుంచి డీసీహెచ్‌ఎస్‌కు, అక్కడి నుంచి ఆయా ప్రభుత్వాసుపత్రులకు జూలై 5వ తేదీన ఉత్తర్వులు అందాయి. ఇదే సమయంలో నూతనంగా నియమించిన చైర్మన్లు, సభ్యులు జూలై 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. అయితే అర్ధాంతరంగా కమిటీలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ కలెక్టర్, డీసీహెచ్‌ఎస్ నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. కాగా పోరుమామిళ్ల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వంకెల రాజగోపాల్ రెడ్డి, మెంబర్లుగా బాలస్వామి, సునీతను కొనసాగించాలని ఆదేశాలు అందినట్లు తెలిసింది.




బద్వేలు ప్రభుత్వాసుపత్రి (ఇన్‌సెట్) ఆసుపత్రి అభివృద్ధి కమిటీని వాయిదా వేస్తూ డీసీహెచ్‌ఎస్ నుంచి వచ్చిన ఉత్తర్వులు

అభివృద్ధికి అడ్డంకిగా మారిన నేతల మధ్య వైరం

నియోజకవర్గ టీడీపీలో గత కొంత కాలంగా అధికారపార్టీ ముఖ్యనేతల మధ్య ఏర్పడిన వైరం నియోజకవర్గ అభివృద్ధికి అడ్డంకిగా మారినట్లు పలువురు మేధావులు అంటున్నారు. వ్యక్తిగత కారణాలతో ఇరువురు నేతలు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నట్లు నియోజకవర్గ అభివృద్ధి మూడేళ్ల కాలంలో ఏమాత్రం జరగలేదని ప్రజలు సైతం పెదవి విరుస్తున్నారు. ఇదే సమయంలో ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్లు సైతం తమకు పదవులు దక్కడం లేదని అంతర్గతంగా మదనపడుతున్నారు. ఇదే పంథా కొనసాగితే రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కొందరు పేరు చెప్పేందుకు ఇష్టపడని అధికారపార్టీ నేతలే అంటుండటం గమనార్హం.

గజరాజుల వరుస దాడులతో భయాందోళన

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామపరిధిలో తరచూ ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుంటే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మూడు రోజుల నుంచి ఏనుగులు రాత్రి సమయాల్లో పంట పొలాల్లోకి వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ ఏనుగుల రాకను అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. రెండురోజుల నుంచి ఏనుగులు గ్రామ సమీపంలోని ఒక కిలోమీటర్‌లోపు పంటపొలాల్లోకి వస్తున్నాయి. ఒక పొలంలోకే కాకుండా సుమారు కిలోమీటరు వరకూ చుట్టుపక్కల ఏనుగుల మంద అరటి, బొప్పాయి, మామిడి, వరిపంటలపై పడి ధ్వసం చేసి వెళుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కోడు సుబ్బయ్య, దేవేందుల పెంచలయ్య, దేరంగుల లక్ష్మయ్యల బొప్పాయి తోటలను ధ్వసం చేశాయి. అటవీశాఖ అధికారులు ఏనుగుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.


ఏనుగులు ధ్వసం చేసిన బొప్పాయి తోట

అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూ ఆక్రమణలు

సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రొద్దుటూరు క్రైం : జిల్లాలోని 10 నియోజక వర్గాల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొంతమంది టీడీపీ వర్గీయులు రాత్రికి రాత్రే వందల ఎకరాల భూములను ఆక్రమించుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక గీతాంజలి పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 90 ఏళ్ల లీజు పేరుతో కారు చౌకగా ఖాళీ భూములన్నీ కై ంకర్యం చేస్తున్నారన్నారు. చెరువులు, కుంటలు, పోరంబోకు స్థలాలు, డీకేటీ భూములు చాలవన్నట్లు ఇసుకను కూడా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసనగా ఆగస్టు 15 వరకూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయనున్నట్లు ఈశ్వరయ్య పేర్కొన్నారు.

కేశవరెడ్డి విద్యాసంస్థలు నొక్కిన డబ్బును కక్కిస్తాం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేశవరెడ్డి విద్యాసంస్థలను స్థాపించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారన్నారు. ఇలా మోసం చేసి వసూలు చేసిన మొత్తం రాయల సీమలోనే సుమారు రూ.400 కోట్లు దాకా ఉందని ఈశ్వరయ్య తెలిపారు. బాధిత కుటుంబాలను ఏకం చేసి వారి డబ్బులు ఇప్పించేలా పోరాటం చేస్తామన్నారు. బాధితులు ఎవరైనా తమను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు సుబ్బరాయుడు, వీరన్నశెట్టి, నరసింహులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు భారం పడనుంది. దీంతో సోమవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. ప్రొద్దుటూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రొద్దుటూరు, బద్వేలు, దువ్వూరు, జమ్మలమడుగు, కమలాపురం, ముద్దనూరు, మైదుకూరు, పులివెందుల, వేంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ ప్రకారం బద్వేలు పరిధిలోని 145 గ్రామాలకు సంబంధించి 25 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీల భారం పడనుంది. అలాగే బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో 10 నుంచి 15 శాతం చార్జీలను పెరగనున్నాయి. దువ్వూరు పరిధిలో 21 గ్రామాలు ఉండగా 7 నుంచి 25 శాతం, జమ్మలమడుగు పరిధిలోని 79 గ్రామాలకు సంబంధించి 10 నుంచి 25శాతం, జమ్మలమడుగు మున్సిపాలిటీలో 10 నుంచి 20 శాతం చార్జీలు పెరగనున్నాయి. కమలాపురం పరిధిలో 62 గ్రామాలు ఉండగా 8 నుంచి 25 శాతం చార్జీలు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి సంబంధించి 8 నుంచి 25 శాతం, ముద్దనూరు పరిధిలో 36 గ్రామాలు ఉండగా 10 నుంచి 25 శాతం చార్జీలు, మైదుకూరులోని 37 గ్రామాలకు సంబంధించి 10 నుంచి 25 శాతం, మైదుకూరు మున్సిపాలిటీలో కూడా ఇలాగే చార్జీలు పెరగనున్నాయి. ప్రొద్దుటూరు పరిధిలో 34 గ్రామాలు, పులివెందల పరిధిలో 80 గ్రామాలు ఉండగా 10 నుంచి 25 శాతం చార్జీలు, వేంపల్లికి సంబంధించి 31 గ్రామాలు ఉండగా 10 నుంచి 25 శాతం చార్జీలు పెరగనున్నాయి.


రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కిటకిటలాడుతున్న ప్రజలు

సాధారణంగా జరిగేదే...

ప్రభుత్వం ప్రతి ఏడాది పరిస్థితులను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతూ ఉంటుంది. ఆ ప్రకారం మంగళవారం నుంచి చార్జీలు పెరగనున్నాయి. గతానికి ఇప్పటికీ పెద్దగా మార్పులు ఏమి లేవు.

– ఆర్.దామోదర్‌రావు, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి



వైవీయూ భూముల పరిరక్షణకు ఉద్యమిస్తాం

• విద్యార్థి సంఘాల నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం భూములను పరిరక్షించుకునేందుకు ఉద్యమిస్తామని వైవీయూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం వైవీయూ ప్రధాన గేటు వద్ద విశ్వవిద్యాలయ భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా.. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఆర్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం.నాగార్జున, ఆర్వీఎస్ వ్యవస్థాపకుడు సీమకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహా మాట్లాడారు. విశ్వవిద్యాలయానికి కేటాయించిన మొత్తం స్థలాన్ని వెంటనే రిజిష్టర్ చేయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కబ్జాకు ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయక్, భరత్‌కుమార్, మనోహర్, చంద్ర, గోపాల్, ప్రవీణ్, ప్రణవ్, పవన్ పాల్గొన్నారు.

డీబీటీని పక్కాగా అమలు చేయాలి

• వేలి ముద్రపడితేనే రైతుకు ఎరువులు



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఠాకూర్ నాయక్

కడప అగ్రికల్చర్ : ఎరువులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎజిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు డి.ఠాకూర్ నాయక్ రువుల దుకాణ డీలర్లను కోరారు. సోమవారం కల్టెరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కడప డివిజన్‌లోని ఎరువుల దుకాణాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో జేడీ మాట్లాడారు. ప్రభుత్వం డీబీటీకి ఆధార్‌తో అనుసంధానం చేసిందన్నారు. బయోమెట్రిక్ మిషన్‌లో వేలి ముద్రవేస్తేనే ఎరువుల సబ్సిడీ కంపెనీకి అందుతుందన్నారు. రెండు, మూడు రోజుల్లో 350 మిషన్లు జిల్లాకు వస్తాయని, వాటిని ఎరువుల దుకాణ డీలర్లకు అందజేస్తామన్నారు. ఆగస్టు 15కల్లా జిల్లాలో డీబీటీ పద్ధతి పూర్తిగా అమలవుతుందన్నారు. రైతులు కూడా ఆధార కార్డు తీసుకుని పోయి నంబరును అనుసంధానం చేయించుకుంటేనే ఎరువులు అందుతాయన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ సునీల్ డీబీటీలో ఎరువుల క్రయ విక్రయాలు ఎలా ఇవ్వాలి, యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ధరలు ఎలా నమోదు చేయాలన్న దానిపై వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరక్టర్ (ఆగ్రనామిస్ట్) విజయభారతి, ఏడీ పీపీ జయరాణి, కడప ఏడీ నరసింహారెడ్డి, జేడీ కార్యాలయ టెక్నికల్ ఏఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

లెక్క తేలాల్సిందే!

- కబ్జా భూములపై విశ్వవిద్యాలయ అధికారులు
- 652.34 ఎకరాల భూమి వైవీయూదే: రెవెన్యూ అధికారులు
- మిగులు భూమి 385.93 ఎకరాలను సర్వే చేసి అప్పగించండి: వీసీ

వైవీయూ :

యోగివేమన విశ్వవిద్యాలయం భూములకు సంబంధించిన పూర్తి లెక్కాచారాలు తేలాల్సిందేనని విశ్వ విద్యాలయ అధికారులు స్పష్టం చేశారు. మొత్తం 1038 ఎకరాల భూమిలో ఇప్పటి వరకు 652.34 ఎకరాలు మాత్రమే విశ్వ విద్యాలయం పేరుతో రిజిష్టర్ అయింది. కేటాయించి కూడా రిజిష్టర్ కానీ మరో 385.93 ఎకరాల భూమిని సైతం సర్వే చేసి విశ్వవిద్యాలయానికి అప్పగించాలని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖకు స్పష్టం చేశారు. దీంతో పూర్తిస్థాయిలో సర్వే చేసేందుకు కొంత సమయం కావాలని అధికారులకు విన్నవించారు.

వీసీతో సమావేశమైన రెవెన్యూ అధికారులు

విశ్వవిద్యాలయ భూముల కబ్జా విషయమై రికార్డులతో సహా పెండ్లిమర్రి తహసీల్దార్ ఆంజనేయులు, గంగనపల్లె వీఆర్ఓ వెంకటసుబ్బయ్య, పెండ్లిమర్రి వీఆర్ఓ ప్రసాద్, సర్వేయర్లు సోమశేఖర రెడ్డి, చంద్రశేఖర్‌ల బృందం వైస్ చాన్స్‌లర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు తీసుకు వచ్చిన రికార్డులను.. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ విభాగం వద్ద గల రికార్డులను పరిశీలించి సరిపోల్చుకున్నారు. ఈ సందర్భంగా పెండ్లిమర్రి తహసీల్దార్



వీసీతో సమావేశమైన రెవెన్యూ అధికారులు

ఆంజనేయులు మాట్లాడుతూ వైవీయూకు ఇప్పటి వరకు 652.34 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి బదలాయించడం జరిగిందన్నారు. 2011 నాటికి వైవీయూ ఆధీనంలో రంపతాడు గ్రామంలో 116 ఎకరాలు, గంగనపల్లెలో 325 ఎకరాలు ఉండగా అదనంగా గంగనపల్లెలో 133 ఎకరాలు, తిప్పిరెడ్డి పల్లెలో 24 ఎకరాలు, రంపతాడులో 48 ఎకరాలు, కొప్పర్తిలో 2.84 ఎకరాలు డీకేటీ, ప్రభుత్వ భూమిని గుర్తించి వైవీయూకు బదలాయించారని తెలిపారు. 2008 సంవత్సరంలో విశ్వవిద్యాలయం కోరిన విధంగా ఇంకా 385.93 ఎకరాల భూమిని బదలాయించాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేసి త్వరలోనే భూముల సర్వేను ప్రారంభిస్తామని వారు విశ్వవిద్యాలయ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భూమి మొత్తం సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని.. విశ్వవిద్యాలయం భూమి మొత్తానికి కంచె ఏర్పాటు చేసుకుంటామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో విశ్వవిద్యాలయానికి కలిగే అవసరాల దృష్ట్యా కేటాయించిన భూమిని పూర్తిగా సంరక్షించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె. చంద్రయ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు రామచంద్రారెడ్డి, నవాజ్, శ్రీనివాసాచారి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది



కబ్జాకు గురైన భూములను పరిశీలించిన రెవెన్యూ అధికారుల..

కాగా విశ్వవిద్యాలయం సమీపంలో కబ్జా చేసేందుకు చదునుచేసిన భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పెండ్లిమర్రి తహసీల్దార్ ఆంజనేయులు నేతృత్వంలోని బృందం సభ్యులు భూములను పరిశీలించారు. వారంరోజుల్లో పూర్తిస్థాయి సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేస్తామని వారు స్పష్టం చేశారు.

ఓటర్ల నమోదుపై ముగిసిన స్పెషల్ డ్రైవ్

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యువ ఓటర్ల నమోదు కోసం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ సోమవారం ముగిసింది. 18–19 ఏళ్లలోపు యువతను ఓటర్లుగా నమోదు చేయించేందుకు జులై 1 నుంచి జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా జనాభాను అనుసరించి 18–19 ఏళ్ల యువత 1,03,409 ఉన్నారని, వీరిని ఓటర్లుగా నమోదు చేయించాలని నిర్ణయించారు. అయితే శనివారం సాయంత్రానికి అందిన సమాచారం ప్రకారం 24,137 కెయిమ్స్ మాత్రమే వచ్చాయి. ఆగస్టు 31 నాటికి క్లెయిమ్స్ పరిష్కారం పూర్తి చేసి వాటిని ఓటర్ల జాబితాలో చేరుస్తారు.

క్లెయిమ్స్ వివరాలు..

బద్వేలు 1823, రాజంపేట 3021, కడప 3029, కోడూరు 1705, రాయచోటి 2504, పులివెందుల 2150, కమలాపురం 2561. జమ్మలమడుగు 2999, ప్రొద్దుటూరు 2088, మైదుకూరు 2257 క్లెయిమ్స్ వచ్చాయి.

104 ఉద్యోగుల రిలే దీక్ష

కడప సెవెన్‌రోడ్స్: తమ సమస్యల పరిష్కారం కోరుతూ 104 ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులురెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జీఓ నెం.151 అమలు చేసి అన్ని క్యాడర్లకు వేతనాలు పెంచాలన్నారు. చంద్రన్న చికిత్స పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రన్న సంచార చికిత్స ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శివరామయ్య, సుధాకర్, రమణ, నాగార్జున, మురళి, శ్రీరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో చిరు జల్లులు

–12 మండలాల్లో ఓ మోస్తరు వర్షం

కడప అగ్రికల్చర్ : వాతావరణంలో మార్పుల కారణంగా మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. జిల్లాలోని 12 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. చిట్వేలులో 14.3 మిల్లీ మీటర్లు, కమలాపురం 11.2, ఖాజీపేట 12.6, రైల్వేకోడూరు 16.7, మైలవరం 18.5, నందలూరు 12.9, పెండ్లిమర్రి 14.1, పుల్లంపేట 12.2, రాజంపేట 20.8, వల్లూరు 14.5, టి సుండుపల్లి 16.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఈ వర్షం ఉద్యాన పంటలకు కాసింత ఊరట కలిగిందని రైతులు అంటున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

- ‘మీ కోసం’లో కలెక్టర్
- అలసత్వం ప్రదర్శిస్తే అధికారుల జీతాల నుంచి రికవరీ

కడప సెవెన్‌రోడ్స్: మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను అక్కడ పరిష్కరించకపోవడం వల్ల పలువురు ప్రజలు జిల్లా కేంద్రంలో జరిగే మీ కోసం కార్యక్రమానికి వస్తున్నారని కలెక్టర్ బాబూ రావునాయుడు అన్నారు. ఇందుకోసం అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకపై తహసీల్దార్లు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే వారి జీతాలనుంచి రికవరీ చేసి ఆ డబ్బును అర్జీదారులకు ఖర్చుల కింద ఇస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ‘మీ కోసం’ కార్యక్రమంలో ఆయన ప్రజల వినతులు స్వీకరించారు. కడప అగాడివీధికి చెందిన కాళ్లు, చేతులు పనిచేయని అయేషాకు శివానందపురంలో ఇంటి స్థలం కేటాయిస్తూ ఆమె తల్లి షేక్ అస్మాకు కలెక్టర్ పట్టా కాగితాన్ని అందజేశారు.

• తన పొలానికి వెళ్లేందుకు రస్తా ఏర్పాటు చేయించాలని చిన్నమండెం మండలం దేవగుడిపల్లెకు చెందిన ఎం.మహేశ్వర్ రెడ్డి కోరారు.

• ఆక్రమణకు గురైన తన ఇంటిని తనకు ఇప్పించాలని సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన సరోజమ్మ కోరారు.

• నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ నిర్మాణంలో కోల్పోయిన తన భూమికి పరిహారం ఇప్పించాలని ఆ మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన సోమరాజు కోరారు.

• కలెక్టర్ కాంప్లెక్స్‌లో ఏ కార్యాలయం ఎక్కడుందో ప్రజలు తెలుసుకునే వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి కోరారు.

ఈ కార్యక్రమంలో జేసీ శ్వేత, డీఆర్వో నరసింహారావు, స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ బాబూరావునాయుడు

ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పిల్లలకు ఎంఆర్ టీకాలు వేయించే కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ బాబూ రావునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూలు వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ విధిగా టీకా వేయించాలని, ఈ విషయంపై తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని కోరారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మోక్షేశ్వరుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కొడుకు అన్నం పెట్టలేదు..



ఉన్న ఒక్కగానొక్క కుమారుడు అన్నం పెట్టలేదు. వయస్సులో ఉన్నప్పుడు పొలం పనులు చేశా. గొర్రెలను కాశాను. ఇప్పుడు పనిచేయలేకపోవడంతో కొడుకు వదిలేశాడు. వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించా. ఇక్కడ చేతనైన పనిచేస్తా. పండ్లు, కూరగాయలు పండిస్తాం. మేమే భుజిస్తాం. ఇక్కడ మాకు ఎలాంటి చీకు చింత లేదు.

- గంగన్న(వృద్ధుడు), గంగనపల్లె



వృద్ధాశ్రమంలో ప్రశాంతంగా ఉంది..



నాకు కుమారులు లేరు. కుమార్తెలకు వివాహమైంది. పట్టెడన్నం పెట్టే దిక్కులేదు. అలాంటి పరిస్థితులలో వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించా. ఇక్కడ ప్రశాంతంగా ఉంది.

- లక్షమ్మ, వృద్ధురాలు , జమ్మలమడుగు

కుటుంబం కోసం.. బిడ్డల కోసం.. వారి ఉన్నతి కోసం ఎంతో కష్టపడ్డారు.. పిల్లల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతం కృషి చేశారు.. ఇప్పుడు జీవిత చరమాంకంలో ఉన్నారు.. వృద్ధాప్యంతో బాధపడుతున్నారు. అయితే ఆప్యాయంగా చూసుకోవాల్సిన బిడ్డలు పట్టించుకోవడం లేదు.. పట్టెడన్నం పెట్టడం లేదు.. ఆత్మీయంగా మాట్లాడడం లేదు.. కన్నబిడ్డల నిరాదరణకు గురైనవారు లీలావతి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు.

వృద్ధుల పాలిట... ఆత్మీయ హస్తం

- కన్నబిడ్డల నిరాదరణకు గురైన వృద్ధులను ఆదరిస్తున్న లీలావతి వృద్ధాశ్రమం
- నేడు 8వ వార్షికోత్సవం

లింగాల :

లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో వెలసిన లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం పండుటాకులను అక్కున చేర్చుకుంటోంది. బిడ్డలకు భారమై వదిలేసిన అనాథ వృద్ధులకు నేనున్నానంటూ లీలావతి చారిటబుల్ ట్రస్ట్ ఆదరిస్తోంది. వారి ఆలనా పాలనా చూస్తోంది. ఊరు బయట ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ వృద్ధాశ్రమం 8 ఏళ్లు పూర్తి చేసుకుంది. కన్నబిడ్డల నిరాదరణకు గురైనవారు ఇక్కడ సేదదీరుతున్నారు.

దాతల విరాళాలతో మంచి భోజనాలు :

లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి దాతలు విరాళాలు విరివిగా అందిస్తున్నారు. అన్నదానాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులకు మూడు పూటలా శుచి, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

కూరగాయల తోటలసాగు ..

వృద్ధాశ్రమానికి రెండు ఎకరాల భూమి ఉంది. ఆ పొలంలో వృద్ధులు కూరగాయలు పండిస్తున్నారు. గోంగూర, టమోట, బెండ, వంగ, పాల కూర తదితర కూరగాయలేగాక మామిడి, అల్లనేరేడు, పనస, జామ, ఉసిరి పండ్ల చెట్లను పెంచారు.

ఆహ్లాదకర వాతావరణం.. :

వృద్ధాశ్రమం చుట్టూ పచ్చదనం పరుచుకుంది. వేప, నీలగిరి, కొబ్బరి చెట్లతోపాటు వివిధ రకాల పూల మొక్కలతో పచ్చదనం పరుచుకొని ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

నేడు వార్షికోత్సవం.. :

ఆగస్ట్ 1వ తేదీన 8వ వార్షికోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, రాజకీయ, ఉద్యోగ ప్రముఖులు వార్షికోత్సవంలో పాల్గొంటారు. అదేవిధంగా రెడ్ క్రాస్‌సొసైటీ, పులివెందుల బ్లడ్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

లీలావతి ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు



వృద్ధాశ్రమం ఆవరణంలో పరుచుకున్న పచ్చదనం



వృద్ధులను బాగా చూసుకుంటున్నాం..



వృద్ధాశ్రమంలోని వృద్ధులను బాగా చూసుకుంటున్నాం. అనారోగ్య పరిస్థితి ఏర్పడినా ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాం. దాతల విరాళాలతో వృద్ధులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నాం. ప్రత్యేక మంచాలు, పరుపులు, దోమ తెరలు ఏర్పాటు చేశాం. కాలక్షేపానికి టీవీ అమర్చాం.

- ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి(ట్రస్ట్ వ్యవస్థాపకులు), చిన్నరంగాపురం



నాగనాథీశ్వరుని కొండకు వచ్చే రహదారి

దేంజ

- పట్టుజారిందా.. అంతే • పుట్‌బో


కడప అర్బన్ :

ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సులను నడపుతాం. రద్దీని బట్టి బస్సులను పెంచుతాం అంటూ సమావేశాల్లో గొప్పగా చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కడప రీజనల్ వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు తమ గ్రామం సమీపంలోని బస్‌స్టాప్‌ల నుంచి ఎంతో ప్రయాసతో తమ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ సమయాల్లో వారు ప్రయాణిస్తున్న బస్సుల్లో రద్దీ ఎక్కువ అవుతున్న కొద్దీ, పుట్ బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోంది.

- జిల్లాలో నలుమూలల నుంచి మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, బద్వేల్, జమ్మలమడుగు, కమలాపురం, వేంపల్లె, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల నుంచి కడపకు ఉదయం 7 :30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు వారి సౌకర్యాన్ని బట్టి ఆయా విద్యాసంస్థల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు, అదే సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలోనే బస్సు సర్వీస్‌లను పెంచాల్సి వుంది.
- కడప రీజనల్ పరిధిలో ఏపీఎస్ ఆర్టీసీ వారు గత ఏడాది 577 ఆర్టీసీ, 296 అద్దె బస్సులను నడిపారు. ఈ ఏడాది 554 ఆర్టీసీ బస్సులను 504 షెడ్యూల్స్, 293 అద్దె బస్సులను నడపుతున్నారు. దీంతో దాదాపు 76 బస్సులను రద్దు చేసినట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- జిల్లాలోని వివిధ బస్సుల ద్వారా దాదాపు మూడు లక్షల కిలోమీటర్లు మేరకు 30 వేల మంది ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. రోడ్డు భద్రత స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు, రవాణా అధికారుల సాయం కూడా తీసుకున్నారు. ఏప్రిల్ నుంచి జూన్ చివరి వరకు కడప రీజనల్ పరిధిలో నష్టాల కన్నా ఆదాయం పొందారు. దాడుల నేపథ్యంలో పోలీసు, రవాణా అధికారులు కూడా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలను సంపాదించి పెట్టారు.



ప్రాణా



...ఇదే..



కొండ పైనుంచి భూమికి తివాచీ పరచినట్లు ఉండే పంటలు

ఆహ్లాదభరితం..

నాగనాథీశ్వర కోన

ప్రకృతి అందానికి నాగనాథీశ్వర కొండ నిదర్శనం. కొండ పై నుంచి చూస్తే చుట్టూ పచ్చని పంట పొలాలు భూమికి పచ్చని తివాచీ పరచినట్లుగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షం వల్ల కొండ అంతా పచ్చని మొక్కల తో ఆహ్లాదభరితంగా ఉంది. కొండకు వచ్చే దారి కూడా పచ్చని చెట్ల మధ్య ఆకర్శనీయంగా ఉంది. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు కనువిందు చేసే ప్రకృతిని చూసి ఆహ్లాదం పొందుతున్నారు. - ఖాజీపేట



పచ్చని నాగనాథీశ్వరుని కొండ

ఫొటోసాక్షి

...ర్ జర్నీ

...ర్డుల్లో విద్యార్థుల జీవితాలు • ఇదీ మన దుస్థితి





రోజూ ఇవే అవస్థలు..

కడప నగరంలో పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు



...లు అరచేతిలో పెట్టుకుని..

...ద్యార్థులకు ఉచిత, రాయితీలతో ...న బస్సు పాస్‌లను కూడా జిల్లా ...్తంగా 30 వేలకు పైగా మంజూరు ...మనీ చెబుతున్నారు. ఐతే వారు ...్యసంస్థలకు వెళ్లే సమయంలో ...త్రం ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయా...న్నప్పటికీ చూసీ, చూడనట్లు వ్యవహ...న్నారనీ విమర్శలు గుప్పుమంటు...ు.

...న్ని రూట్లలో విద్యార్థులు వచ్చి ...ల తరబడి బస్‌స్టాప్‌లలో వేచి వున్న ...కీ తాము వెళ్లాల్సిన బస్సులు వచ్చిన ... మాత్రం ఆపకుండానే నిర్లక్ష్యంగా ...ోవడం, విద్యార్థులు ధర్నాలు చేస్తే ... ప్రయోజనం లేకుండా పోతోందనీ ...ోళనల ద్వారా తెలుస్తోంది.

...ంతమంది విద్యార్థులు బస్సులను ...నప్పటి నుంచి దిగేవరకు ప్రాణాలను ... గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోందనీ ...న వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల ఫుట్‌బోర్డ్ ప్రయాణం

రూట్లలో పరిశీలించి బస్సు సర్వీస్‌లను పెంచుతాం


కడప రీజనల్ పరిధిలో 8 డిపోల వారీగా విద్యార్థులు, ఉద్యోగుల రద్దీ సాధారణంగా ఉదయం, సాయంత్రం ఉంటుందనీ, ఆయా ప్రాంతాల్లో బస్‌స్టాప్ కేంద్రాలను తమ సిబ్బందితో స్వయంగా పరిశీలించి త్వరలో బస్సు సర్వీస్‌లను పెంచుతాం. విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

- కిషోర్, డెప్యూటీ సీటిఎం, ఏపీఎస్ ఆర్టీసీ, కడప.

జయహో... భారత్...

పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాల లోని కొందరు విద్యార్థులు బంకమట్టితో సోమవారం భారత దేశం, వాటి భౌగోళిక స్వరూపాల నమూనాను తయారుచేశారు. తోటి విద్యార్థులకు భారతదేశంలోని వివిధ రకాల పర్వతాలు, నదులు గురించి అవగాహన కల్పించారు. సృజనకు పదునుపెట్టి నమూనా తయారుచేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ మైఖేల్, విద్యార్థులు పాల్గొన్నారు.
- పుల్లంపేట





నమో... నారసింహా..



ప్రొద్దుటూరు మండలం నరసింహాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదిన సందర్భంగా విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేసి నూతన పట్టువస్త్రాలతో, ఆభరణాలతో, గజమాలలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కడప దత్తపీఠం భక్తులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. - ప్రొద్దుటూరు కల్చరల్

అన్నా.. అమ్మకు ఎంత కష్టం.!


అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణి

కడప కోటిరెడ్డి సర్కిల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్న అమృతహస్తం పథకం బాలారిష్టాలను దాటలేకపోతోంది. మాతా శిశు మరణాలు తగ్గింపే లక్ష్యంగా ప్రభుత్వం అమృతహస్తం పథకాన్ని గత నెల 1వ తేదీ నుంచి జిల్లాలో అమలు చేస్తోంది. గతంలో గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బియ్యం, కోడిగుడ్లు, నూనె టేక్ హోం పద్ధతిలో ఇంటికి తీసుకెళ్లే వారు. ఈ విధానంలో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవడం లేదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. దీంతో పౌష్టికాహారాన్ని అందించేందుకు అన్న అమృతహస్తం పథకాన్ని ప్రవేశ పెట్టింది.

పట్టణ ప్రాంతాల్లో నిరాదరణ

ప్రభుత్వ ఆశయం ఒక రకంగా ఉండగా, క్షేత్ర స్థాయిలో పథకం అమలు మరోలా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా మధ్యాహ్న భోజనాన్ని రేషన్ బియ్యంతో వడ్డించడంపై సర్వత్రా విముఖత వ్యక్తమవుతోంది. ఈ అన్నం తింటే కడుపునొప్పి వస్తోందని బాలింతలు చెబుతున్నారు. వీరు పాలు, గుడ్డును తీసుకుంటూ అన్నం తినేందుకు ఇష్టపడటం లేదు. పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడం, కొంతమంది చిన్నపాటి ఉద్యోగాలకు వెళుతుండడం వల్ల మధ్యాహ్న భోజనానికి హాజరు శాతం 30 శాతానికి మించడం లేదని సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త మెరుగ్గానే ఉందని ఐసీడీఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. సుమారు 30–40 శాతం మంది హాజరవుతున్నట్లు వారు చెబుతుండడం విశేషం. పాత పద్ధతిలోనే టేక్ హోం పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 46 వేల మందికి ఈ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

ఉపయోగపడని పైలెట్ ప్రాజెక్టు

జిల్లాలో 15 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మూడేళ్ల క్రితం ఎనిమిది ప్రాజెక్టుల్లో అమృతహస్తం పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. పథకం అమలులో ఎదురయ్యే ఇబ్బందులపై సక్రమంగా నివేదికలు సమర్పించడంలో సంబంధిత ప్రాజెక్టులు విఫలమయ్యాయనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అమలులోకి వచ్చేసరికి ఒక్కో సమస్యను అధిగమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఐసీడీఎస్ అధికారులు ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సి ఉంది.

సిబ్బందికి కూరగాయాలు

అన్న అమృతహస్తం పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునికి బియ్యం, పప్పు, నూనె, పాలు, కోడిగుడ్డు, వంట వండేందుకు గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తోంది. కూరగాయలు, సరుకుల కొనుగోలుకు ఒక్కో లబ్ధిదారునికి రోజుకు రూ. 1.90 చొప్పున నిధులు చెల్లిస్తోంది. కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈ నిధులు ఏ మూలకూ సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ప్రత్యామ్నాయంగా పంచాయతీల సహకారం తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నా సర్పంచుల నుంచి పెద్దగా స్పందన రావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు.

అమృతహస్తం మెనూ ఇలా...

- సోమవారం అన్నం, కూరగాయలతో కూడిన సాంబారు, గుడ్డు కూర, పాలు.
- మంగళ, బుధ వారాలలో అన్నం, పప్పు, ఆకుకూర, గుడ్డు, పాలు.
- గురువారం అన్నం, కూరగాయలతో సాంబారు, గుడ్డు కూర, పాలు.
- శుక్ర, శనివారాలలో అన్నం, పప్పు, ఆకు కూర, గుడ్డు, పాలు.

ఇవీ అవస్థలు..

- ఇంటి దగ్గరైతే ఆకలేసిన సమయంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు తినవచ్చు. అదే అంగన్‌వాడీ కేంద్రంలో అయితే నిర్ణీత సమయానికే వెళ్లి తినాలి.
- కేంద్రాలకు వెళ్లాలంటే గర్భిణులు, నెల లోపు బాలింతలు అవస్థలు పడుతున్నారు. కొన్ని కేంద్రాలు దూరంగా ఉండడం, కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.
- ఆపరేషన్ చేసుకున్న బాలింతలు కింద కూర్చోలేక పోతుండడం..నలుగురు కూర్చొనే గదిలో 20 మంది కూర్చొని తినడం తదితర కారణాలు వెలుగులోకి వస్తున్నాయి.

సమస్యను అధిగమిస్తాం



అన్న అమృతహస్తం పథకం అమలులో చిన్నచిన్న సమస్యలు ఉన్న మాట వాస్తవమే. రోజుకు 46 వేల మందికి పౌష్టికాహారం అందించే ఈ పథకంలో చిన్న పాటి ఇబ్బందులు తలెత్తుతుంటాయి. వీటిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తాం. గర్భిణులకు తొమ్మిదో నెల నుంచి ప్రసవం తర్వాత నెలరోజుల వరకు భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లే వెసులుబాటు ఉంది.

– రాఘవరావు, పీడీ, ఐసీడీఎస్

పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలలో రేషన్ బియ్యం అందిస్తున్నామని, ఆ అన్నం తినడం వల్ల కడుపునొప్పి తదితర సమస్యలు వస్తున్నాయని చెప్పడంలో వాస్తవం లేదు. పోషక విలువలతో కూడిన దంపుడు బియ్యాన్ని మాత్రమే అందిస్తున్నాం. మిగతా విషయాల్లో కూడా ఏమాత్రం తగ్గకుండా గర్భిణులు, బాలింతలకు మావంతుగా సేవలు అందిస్తున్నాం.

– వసంతబాయి, సీడీపీఓ, రాయచోటి

కౌన్సెలింగ్‌లో అన్యాయం చేశారు

ఓ మహిళా ఉపాధ్యాయురాలి ఆవేదన

కడప ఎడ్యుకేషన్: కమలాపురం మండలం సి. రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్. షహజమీర్ అనే ఉపాధ్యాయురాలు తనకు 4వ కేటగిరి పాయింట్ల విషయంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కమలాపురం మండలం సి. రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టుకు సంబంధించి గత ఆరేళ్ల నుంచి తాను స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసున్నానని తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో దరఖాస్తు చేసుకోగా తమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికి గతంలో ఉన్న 4వ కేటగిరి కింద పాయింట్లు వచ్చాయని తనకు మాత్రం రాలేదన్నారు. కౌన్సెలింగ్‌లో తొలుత సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రారంభించగా సీనియారిటీ జాబితాలో తకు 4వ కేటగిరి పాయింట్లు తీసేశారన్నారు. తరువాత వచ్చిన హెచ్‌ఎం, పీఎస్, తెలుగు, హిందీ సబ్జెక్టుల వారికి తిరిగి పాయింట్లు చేర్చారని పేర్కొన్నారు. దీంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయారు. ఈ కారణంగా తనకు పాయింట్లు పెరిగి వెనుకబడిపోయానన్నారు. తనకు సరైన పాఠశాల లభించనందున తమ పాఠశాలను విలీనం చేసిన నల్లలింగాయపల్లెకు వెళ్లమని డీఈఓ పూల్‌లో ఉంచారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కూరగాయల సాగుకు ఇదే అదును

- సేంద్రియ పద్ధతులు పాటిస్తే మంచి ఆదాయం
- సస్యరక్షణ చర్యలు కీలకం

కడప అగ్రికల్చర్ :

సంప్రదాయ పంటల సాగుతో నష్టపోతున్న రైతులు సాగు నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కూరగాయ ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ఆ దిశగా మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నీటి వసతి ఉన్న, మెట్ట ప్రాంతాలు కూరగాయల సాగుకు అనుకూలమని జిల్లా ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రనాథరెడ్డి చెబుతున్నారు.

రెండు నెలల్లో కాపు.. దిగుబడి

ముఖ్యంగా మిరప, బెండ, మటిక, వంగ, కాకర, బీర, దోస, దొండ, పొట్లకాయలు, ఇతర తీగజాతి కూరగాయలను పందిళ్లలో సాగు చేస్తే మంచి ఆదాయం ఉంటుందని ఏడీ అంటున్నారు. ఇప్పుడు సాగు చేస్తే రెండు నెలల్లో కాపు మొదలై మరో రెండు నెలలపాటు దిగుబడులు లభిస్తాయని చెబుతున్నారు. మన ప్రాంతానికి అనుకూలమైన రకాలు, సాగు పద్ధతులు, విత్తనాల ఎంపికపై ఏడీలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నేలలు... విత్తన రకాలు

నీరు నిలువని, తేలికపాటి బంక మట్టి నేలలు ఇందుకు అనుకూలం. ఇటువంటి భూముల్లో అధిక దిగుబడులు పొందవచ్చు. వర్షపు మురుగు బయటకు పోయే భూములు, బాగా ఇంకిపోయే భూములు అనుకూలం. భూములను బాగా మెత్తగా దుక్కులు దున్నుకుని ఎత్తుబెడ్లు తయారు చేసుకుని, వర్షపు నీరు బయటకు పోయేలా కాలువలు తయారు చేసుకోవాలి.

- కాకరలో పూసా దో మౌసమి, కోయంబత్తూరు లాంగ్, ఆర్కాహరిత, పూసా విశేష్, వీకే-1, ప్రియ, సదాబహార్ మేలు.
- బీరలో జగిత్యాల లాంగ్, కో-1, పూసాన స్దార్, బన్సీ, కావేరీ మంచి దిగుబడి ఇస్తాయి.
- దోసలో జ్యోతిర్మయి రకం మన ప్రాంతానికి అనుకూలం.
- పచ్చదోస సాగులో జపనీస్ లాంగ్ గ్రీన్, శ్వేత-8, పూసా సన్యోగ్, పాయిన్ సెట్టి
- పొట్లకాయలో శ్వేత, కో-1 రకాలు అనువుగా ఉంటాయి.



పెండ్లిమర్రి మండలం చెన్నంరాజుపల్లె వద్ద సాగైన బీర, కాకర

విత్తన మోతాదు, దిగుబడి ఇలా..

కాకర, సొర, బీర సాధారణ రకాలైతే ఎకరాకు 2 కిలోలు, హైబ్రిడ్ రకాలైతే 400 నుంచి 500 గ్రాముల విత్తనాలు అవసరమవుతాయి. పొట్ల సాగుకు 600 గ్రాములు, పచ్చ దోసకు కిలో విత్తనాలు అవసరమవుతాయి. కాకర 80 నుంచి 120 క్వింటాళ్లు, బీర 60 నుంచి 150 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సొరకాయల్లో సాధారణ రకాలైతే 140, హైబ్రిడ్ రకాలైతే 300 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తుంది. పచ్చదోస 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తనాలు పూడ్చే పద్ధతి....

అన్ని రకాల పాదులకు 45 - 45 - 45 సెంటీ మీటర్ల పరిమాణం కలిగిన గుంతలు తీసి 1.2 సెంటీ మీటర్ల లోతులో 3-5 విత్తనాలు పూడ్చి.. తరువాత నీరు పెట్టాలి. విత్తనాలు మొలకెత్తిన తరువాత పాదికి 1,2 మొక్కలు ఉంచి మిగిలిన వాటిని తీసేయాలి. దొండ పాదుల్లో 4 కనుపులుగల చూపుడు వేలు ఉన్న కొమ్మలు నాటుకోవాలి. కాకర, బీరను తీసుకుంటే వరుసల మధ్య 2 మీటర్లు, పాదుల మధ్య 0.90 మీటర్లు ఎడం వ్యత్యాసం పాటించాలి.

జీవన ఎరువులు...

హెక్టారుకు ఫాస్ఫోబ్యాక్టీరియా, 2 కిలోల అజోస్పైరల్లం, 2-5 కిలోల సుడోమోనాస్, 50 కిలోల పశువుల ఎరువు, 100 కిలోల వేప పిండి ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి.

జీవ నియంత్రణ ఎరువులు..

ఎకరాకు ట్రైకోడెర్మావిరిడి 3 కిలోలు, పశువుల ఎరువు 300 కిలోలు, వేప పిండి 30 కిలోలు అవసరం అవుతుంది. ఈ మూడింటిని కలిపి మూడు రోజులు ఎండ తగలకుండా గాలి ఆడే ప్రదేశంలో ఉంచాలి. కుప్పపై సంచిపట్ట కప్పి నాలుగు రోజులకోసారి బాగా కలియబెట్టాలి. ఏడు రోజుల తరువాత శిలీంధ్రం బాగా పెరుగుతుంది. ఈ మిశ్రమాన్ని మొక్కల పాదుల వద్ద వేయాలి. నేల స్వభావాన్ని బట్టి అవసరమైన మేరకు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు ..

తీగజాతి కూరగాయలకు ఎక్కువ బూడిద తెగులు, బూజు తెగులు, మచ్చ తెగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. సకాలంలో శాస్త్రవేత్తల సలహా మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పురుగుల నివారణకు వేపనూనె, వేప గింజల కషాయం వాడాలి. పురుగు మందులను కూరగాయల పంటలపై విచక్షణ రహితంగా వాడవద్దు. గంధకం, రాగిధాతు సంబంధమైన మందులు తీగజాతి కూరగాయలపై పిచికారీ చేయొద్దు. వాడితే పంట మాడిపోతుంది. గంధకం బదులుగా డైకోఫాల్ వాడడం మంచిది.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలి

– గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ

కడప అర్బన్ : జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సమస్యలపై వచ్చే బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లకు బాధితులు వస్తే తప్పకుండా వారి ఆవేదనను ఓపికగా వినాలన్నారు. తర్వాత న్యాయ, అన్యాయాలను విచారించి తగిన పరిష్కారం చూపాలన్నారు. సరైన న్యాయం బాధితులకు చేసినపుడే సమాజంలో పోలీసులపై గౌరవం కలుగుతుందన్నారు.

వీడిన నాగమ్మ మృతి కేసు



చిన్న నాగమ్మ(ఫైల్)

కొండాపురం: భార్యపై అనుమానంపై హత్య చేసి అనంతరం పూడ్చివేసిన కేసును కొండాపురం పోలీసులు ఛేదించారు. వివరాలు.. కొండాపురంలోని ఏకలవ్య కాలనీకి చెందిన మేదారి నాగేష్ అలియాస్ నాగన్న, మేదారి చిన్న నాగమ్మ 2003లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. నాగమ్మ వెంకటేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయమై భార్యను మందలించినా ఆమెలో మార్పు రాకపోవడంతో గతేడాది జూలైలో నాగమ్మ(28)ను హత్యచేసి మండలంలోని పొట్టిపాడు సమీపంలోని చిత్రావతి నదిలో ఆమె భర్త పూడ్చివేశాడు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు ఆమె భర్తే నాగమ్మను అంతమొందించినట్లు తేల్చారు. సోమవారం కొండాపురం సీఐ చిన్నరామయ్య, ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బరామయ్య సమక్షంలో నాగమ్మ మృతదేహాన్ని వెలికి తీసి, పంచనామ నిమిత్తం కడప రిమ్స్‌కు తరిలించారు. నాగమ్మను భర్త నాగన్న, తండ్రి సుబ్బన్న, తమ్ముడు రమేష్ కలసి గొంతు నులిపి నదిలోనే హత మార్చినట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు.

జీఎస్టీ పరిధిలోకి చేనేతలు

ప్రొద్దుటూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేనేతలు జీఎస్టీ పరిధిలోకి వస్తారని, ఇందుకు సంబంధించి ప్రత్యేకించి ఎలాంటి మినహాయింపు లేదని జీఎస్టీ జిల్లా జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో సోమవారం జిల్లా చేనేత, పట్టు వీవర్స్, మాస్టర్స్ వీవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. హాజరైన ఆమె చేనేతలకు సంబంధించిన అనుమానాలను నివృతి చేశారు. చేనేతలు నేసే ఖాదీయార్న్, ముడి శిల్క్‌కు మాత్రమే పన్ను మినహాయింపు ఉంటుందని, పట్టు వస్త్రాలు, ఇతర వస్త్రాలు తయారు చేసే నేపథ్యంలో అన్నింటికీ పన్ను చెల్లించాలన్నారు. రూ.20 లక్షలు లోపు టర్నోవర్ కలిగి ఉంటే పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ విధానాలపై మరింత స్పష్టత ఇవ్వాలని, శిల్క్ నేసే కార్మికులపై పన్ను విధించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ అవ్వారు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో శిల్క్ ఎక్స్ఛేంజీ టెక్నికల్ ఆఫీసర్ ఏఆర్ఎస్ దీక్షిత్, డిప్యూటీ కమిషనర్ సుమతి, అసిస్టెంట్ కమిషనర్ వరలక్ష్మి, లూర్థయ్యానాయుడు, ఆడిటర్ వరదరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి

బెల్ట్‌షాపులపై దాడులు చేయండి: చీఫ్ సెక్రటరీ

కడప సెవెన్‌రోడ్స్ : బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, దాడులు ముమ్మరం చేయాలని సూచించారు. ఎంఆర్ వ్యాక్సిన్ పిల్లలందరికీ వేయించాలని, అంటువ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాబూరావునాయుడు, జేసీ శ్వేత తెవతీయ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్, స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

14 గొర్రెలు, 2 మేకలు మృతి • 20 గొర్రెలకు తీవ్ర గాయాలు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు,మేకలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కుర్నూతల గ్రామం చాగలగుట్టపల్లెలో దేరింగుల గంగులమ్మకు చెందిన 80 గొర్రెలపై కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. దాడిలో 14 గొర్రెలు, రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 గొర్రెలకు గాయాలయ్యాయి. సోమవారం ఇంటి నుంచి ఊరి బయట ఉన్న మందలోకి గొర్రెలను మళ్లించి తర్వాత గంగులమ్మ ఇంటికి వచ్చింది. అంతలోనే కొన్ని గొర్రెలు తీవ్ర గాయాలతో పరుగులు పెడుతూ ఇంటికి వచ్చాయి. గమనించిన గొర్రెల యజమానులు మంద వద్దకు వెళ్లి చూడగా దాదాపు పది కుక్కలు ఒకేసారి మందపై పడి స్వైర విహారం చేస్తూ కనిపించాయి. గట్టిగా కేకలు వేసి వారు కుక్కలను తరిమి వేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గ్రామాల్లో కుక్కల బెడద అధికమై మనుషులపైనే గాకుండా గొర్రెలు, మేకలపై కూడా దాడి చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం అందజేసి, గాయపడిన గొర్రెలకు వైద్యం అందజేయాలని బాధితులు కోరుతున్నారు. అలాగే కుక్కల బారినుంచి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్ల సందడి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆస్తుల క్రయ విక్రయాలపై ప్రభుత్వం భారీగా పెంచిన చార్జీలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమలులోకి రానుండంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సోమవారం సాయంత్రం నుంచి కిక్కిరిసియాయి. ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తమ ఆస్తులకు సంబంధించి క్రయ విక్రయాలు నిర్వహించుకునేందుకు కార్యాలయానికి తరలివచ్చినప్పటికీ ఆన్‌లైన్ సర్వర్ డౌన్ అవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. సాయంత్రం 4.30 గంటలకు సర్వర్ పనిచేయడంతో అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది. బుధవారం ఒక్కరోజే ప్రభుత్వానికి సుమారు రూ. 60 లక్షలకు పైగానే ఆదాయం సమకూరిందని కార్యాలయ వర్గాలు తెలిపాయి. సందట్లో సడేమియాలా దళారులు అందిక కాడికి దండుకున్నారు.



రాత్రి 10 గంటలకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రజల రద్దీ



రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న ప్రజలు

సమాచారం వార్తలు

కడప సినిమాలు

రవి :	ఫిదా
ప్రతాప్ :	వాసుకి
రాజా (రహత్) :	డీజే
మురళి :	గౌతమ్‌నంద
సుధ :	నాకు నేను తోపు తురుమ్
తాహర్ :	ముబారకన్
అమీర్ :	దండుపాళ్యం–2
రమేష్ :	గౌతమ్‌నంద
అప్సర :	శమంతకమణి
ఎస్ఆర్ (సాయిబాబా) :	నిన్ను కోరి

పోలీస్ డైరీ

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కడప నగరంలోని టుటౌన్ పోలీసుస్టేషన్‌పరిధిలో సోమవారం వక్కలపేట పరిసర ప్రాంతాల్లో కంప చెట్లలో జూదమాడుతున్న ఎనిమిది మందిని ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తమ సిబ్బందితో అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారినుంచి రూ. 12,180 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

జిల్లాలోని కలసపాడు మండలం శంకవరానికి చెందిన ఆర్.ఓబులేశు (28) అనే యువకుడు తనకు వివాహం జరగదనే అనుమానంతో కిరోసిన్ సేవించి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే మండలానికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. అయితే అదే గ్రామానికి చెందిన అటవీశాఖలో గార్డుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి బాధితునిపై చెడు ప్రచారం చేయడంతో యువతి తల్లిదండ్రులు వివాహానికి నిరాకరించారు. దీంతో యువకుడు ఈ చర్యకు పాల్పడ్డాడు. సంఘటన జరిగిన వెంటనే అతన్ని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసుస్టేషన్ ఏఎస్ఐ పుష్పరాజు బాధితుని ఫిర్యాదుని స్వీకరించి కలసపాడు పోలీసులకు బదిలీ చేశారు.

బాలిక అదృశ్యం

జూలై 25వ తేదీ నుంచి తన కుమార్తె (17) కనిపించడం లేదని పాత కడపకు చెందిన మహేశ్వరి చిన్నచౌక్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఇంటర్ చదువుతోన్న తన కుమార్తె కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలు పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

టుటౌన్ పరిధిలో చోరీ

నగరంలోని షేక్ షంషాద్ పర్వీన్ అనే మహిళ తన సోదరుని ఇంటికి దీపం చూసేందుకు గత శుక్రవారం వెళ్లింది. తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గ్రహించింది. వెంటనే టుటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాదాపు 30 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని అందులో తెలిపింది. కేసు దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ రుష్యేంద్రబాబు తెలిపారు. –కడప అర్బన్

నోటీస్ బోర్డ్

మెప్మా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం

నగరంలోని నిరుద్యోగ యువతకు మెప్మా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి అంజన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్‌నగర్‌లోని ట్రెడ్జ్ ఐటీ ఆధ్వర్యంలో మెప్మా సహకారంతో 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ట్యాలీలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు కుట్టుమిషన్ శిక్షణను కూడా అందించనున్నట్లు ఆయన వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ప్రకాశ్‌నగర్‌లోని ట్రెడ్జ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉప ఎన్నికల్లో గెలుపునకే టీడీపీ అడ్డదారులు



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

ధ్వజమెత్తిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ :

నంద్యాల ఉప ఎన్నికల్లో గెలవడానికి అధికార తెలుగుదేశం పార్టీ అడ్డదారులు తొక్కుతోందని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రాజశేఖర్, మైనార్టీ నగర అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ, కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయని టీడీపీ ప్రభుత్వం నంద్యాల ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 13వేల ఇళ్లను ఒకేసారి మంజూరు చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని, మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఈ ప్రభుత్వమే నన్నారు. నంద్యాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే మైనార్టీ నేత ఫరూఖ్‌కు మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. టీడీపీ అరాచకాలు, అక్రమాలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాల్లాంటి పథకాలు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు మస్తాన్, షబ్బీర్, రహీమ్, ఆజమ్ బుఖారి పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమతో అభివృద్ధి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :జిల్లాలో ఉక్కు పరిశ్రమతోనే అభివృద్ధి జరుగుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధినేత రామ్మూర్తి తెలిపారు. జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్‌సీపీ చేస్తున్న దీక్షలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ దీక్షలో రమేష్, గౌస్, విజయ్, రవి, రమణ పాల్గొన్నారు.

నగర మ్యాప్‌లను అందజేయండి

కడప కోటిరెడ్డి సర్కిల్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కొత్తగా వేసిన డోర్ నెంబర్లు సెంట్రల్ ఈస్ట్, వెస్ట్, నార్త్ జోన్‌లోగల డోర్ నెంబర్ల విభజించి నగర మ్యాప్‌లను జిరాక్స్ రూపంలో అందజేయాలని బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు తెలిపారు. సోమవారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌డ్రైవ్ ద్వారాగానీ, సీడీ రూపంలోగానీ డివిజన్లలోని ప్రెసిడెంట్లకు అందజేయాలని కోరారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమరగాయకుడు మహ్మద్ రఫీ



మహ్మద్ రఫీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తాజ్ షరీఫ్, అభిమానులు

కడప కార్పొరేషన్ : అమర గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతి కార్యక్రమం జిల్లా చిరు, పవన్, రామ్‌చరణ్ అల్లు అర్జున్ యువత అధ్యక్షుడు తాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాజ్ షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతిస్తే మహ్మద్‌రఫీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు గణేష్, రాజశేఖర్, మస్తాన్ బాషా, సునీల్, భాస్కర్ పాల్గొన్నారు.

రహమతీయ ఫంక్షన్ హాల్లో..

కడప కల్చరల్: అమర గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా స్థానిక సంగీతాభిమానులు ఘన నివాళులర్పించారు.సోమవారం స్థానిక రహమతీయ ఫంక్షన్ హాలులో స్థానిక ప్రముఖులు అమీర్‌బాబు ఆధ్వర్యంలో మహమ్మద్ రఫీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందీ చలనచిత్ర సంగీత రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన గాయకుడు రఫీ తెలుగు చిత్రసీమకు కూడా తన గానామృతాన్ని రుచి చూపారన్నారు. కార్యక్రమంలో కరీముల్లా, నిజామ్, అఫ్జల్‌ఖాన్, సలీం, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



కార్పొరేషన్ గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా, అదనపు కమిషనర్ నిరంజన్ రెడ్డి

గ్రీవెన్స్‌సెల్‌లో డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని డిప్యూటీ మేయర్ బి. ఆరీఫుల్లా, అదనపు కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సభాభవనంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులన్నీ పరిష్కరించాలని ఆయా విభాగాలకు బదిలీ చేశామని డిప్యూటీ మేయర్, అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎంఈ చెన్నకేశవరెడ్డి, డీఈఈలు కరిముల్లా ఖాన్, శ్రీనివాసులరెడ్డి, టీపీఓ ఆసిఫ్, ఆర్ఓ విజయ్ భాస్కర్ గౌడ్, శానిటరీ సూపర్‌వైజర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని.. ● తన ఇంటికి సంబంధించిన వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ఇంటికి కొళాయి, కరెంట్ కనెక్షన్ తొలగించారని ఎన్‌జీవో కాలనీకి చెందిన షేక్ ముంతాజ్‌బేగం ఫిర్యాదు చేశారు.
● ఒకే ఇంటికి రెండు పన్నులు వేశారని ఎన్‌జీవో కాలనీకి చెందిన శివప్రసాద్ తెలిపారు. ● స్వామి నగర్‌లో రోడ్డు, డ్రైనేజి కాలువను తమ ఇళ్ల వద్దకు పొడిగించాలని స్థానికులు కోరారు.
● భూగర్భ డ్రైనేజీ పనులు చేసిన ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేయాలని చంద్రమౌళీనగర్‌కు చెందిన పాండురంగాచారి కోరారు.
● నాగరాజుపేటలోని శ్రీహరిరావు వీధిలో మురికి కాలువల్లో నీరు పోవడం లేదని, వాటిని శుభ్రపరచాలని స్థానికులు వినతిపత్రమిచ్చారు.

ప్రచండ శక్తికి ప్రతీక శ్రీరాముడు



రామాయణం గురించి వివరిస్తున్న శ్రీ రామానుజదాసస్వామి

కడప కల్చరల్: శ్రీరామచంద్రునిలో అన్ని మంచి గుణాలతోపాటు ప్రచండమైన శక్తి కూడా ఉందని రామ రావణ యుద్ధంలో తెలియవచ్చిందని గుంటూరుజిల్లా అంగలకుదురు శ్రీ కోదండరామసేవక ధర్మ సమాజం ప్రతినిధి శ్రీ రామానుజదాసస్వామి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఆయన శ్రీమద్ రామాయణంపై ప్రవచనాలు చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమ ప్రారంభంలో ఆలయ అర్చకులు, ధార్మిక ప్రముఖులతోపాటు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి హనుమంతుని ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహించారు.

జిల్లాకు చేరిన ఎరువులు

కడప అగ్రికల్చర్ : జిల్లాకు 3298 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయని వ్యవసాయశాఖ కడప డివిజన్ ఏడీ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లోని గూడ్సు షెడ్డుకు ఎరువుల వ్యాగన్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో డీఏపీ ఎరువు 1392 మెట్రిక్ టన్నులు, 28:28:0 రకం ఎరువు 1210 మెట్రిక్ టన్నులు, 14:35:14 రకం ఎరువు 696 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. ఏడీ వెంట కడప వ్యవసాయాధికారి గంజికుంట రామకృష్ణ ఉన్నారు.

కళాక్షేత్రంలో మెప్మా బజార్

కడప కార్పొరేషన్ : నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో సోమవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బజార్ ఏర్పాటు చేశారు. ఈ మెప్మా బజారును పీడీ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి అమ్మకాలు జరిపారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన వారు కూడా తమ ఉత్పత్తుల విక్రయాలు జరిపారు. మెప్మా సీఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్ – 30 అమలు

కడప అర్బన్: కడప సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి ఆగస్టు 30 వరకు పోలీస్ యాక్ట్–30 అమలులో ఉంటుందని డీఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం ఏదైనా ర్యాలీలు, బహిరంగ సభలు, ఇతర కార్యక్రమాలు జరగాలంటే 48 గంటల ముందుగా అనుమతిని తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీసుల అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా దామోదర్‌రావు

కడప కోటిరెడ్డి సర్కిల్ :జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా దామోదర్‌రావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శివగోపాల్‌ప్రసాద్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కుంటుపడకుండా ఉండేందుకు ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న దామోదర్‌రావును ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం నియమించింది.

స్వతంత్ర భారత తొలి గవర్నర్ జనరల్ ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో గాంధీజీతో పాటు పాల్గొన్న ఏకైక తెలుగు వ్యక్తి?
   1) వావిలాల గోపాలకృష్ణయ్య
   2) తెన్నేటి విశ్వనాథం
   3) అయ్యదేవర కాళేశ్వరరావు
   4) ఎర్నేని సుబ్రమణ్యం
2. కింది వాటిలో మార్కోపోలో రాసిన గ్రంథం?
   1) ఏనల్స్ హిస్టరీ ఆఫ్ రాజస్థాన్
   2) గైడ్ టు జాగ్రఫీ
   3) ది ట్రావెల్స్ 4) నేచురల్ హిస్టరీ
3. 'ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్'ను సర్ విలియం జోన్స్ ఎప్పుడు స్థాపించాడు?
   1) 1784 2) 1786
   3) 1788 4) 1792
4. ఉత్తర సర్కారులను ఆంగ్లేయులకు అప్పగించిన హైదరాబాద్ నిజాం ఎవరు?
   1) నిజాం అలీఖాన్ 2) సికిందర్‌ఝా
   3) మీర్ మహబూబ్ అలీఖాన్
   4) మీర్ ఉస్మాన్ అలీఖాన్
5. కింది వాటిలో సరైన జత ఏది?
   1) కాకినాడ బాంబు కేసు – ప్రతివాది వెంకట భయంకరాచారి
   2) సీతానగర ఆశ్రమం – తూర్పుగోదావరి
   3) చిదంబరం పిళ్లై – తిరునల్వేలి కేసు
   4) పైవన్నీ సరైనవే
6. పుదుచ్చేరి ప్రాచీన నామం?
   1) దేశీయకొండ పట్టణం
   2) వాలికొండాపురం
   3) బేతవోలు 4) రేవతీ ద్వీపం
7. ఎవరిని వివాహమాడడంతో 'ఇంగ్లండ్ రాజు రెండో చార్లెస్'కు పోర్చుగీసువారు ముంబైను కట్నంగా ఇచ్చారు?
   1) కేథరిన్ 2) మేరీ
   3) ఇసబెల్లా 4) విక్టోరియా
8. పోర్చుగీసువారు గోవాను శ్రీ కృష్ణదేవరాయల సహాయంతో ఏ సంవత్సరంలో ఆక్రమించారు?
   1) 1509 2) 1510
   3) 1515 4) 1527
9. గోండుల్లో నరబలిని నిషేధించిన భారతదేశ గవర్నర్ జనరల్ ఎవరు?
   1) లార్డ్ హెన్రీ హార్డింజ్
   2) చార్లెస్ మెట్‌కాఫ్
   3) లార్డ్ విలియం బెంటింక్
   4) లార్డ్ ఎల్లెన్‌బరో
10. భారత్‌లోనే తొలి మహిళా విశ్వవిద్యాలయాన్ని డి.కె. కార్వే ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశాడు?
    1) 1914 2) 1916
    3) 1918 4) 1920
11. 'మొదటి రౌండ్ టేబుల్' సమావేశాన్ని ప్రారంభించిన వారెవరు?
    1) రెండో చార్లెస్
    2) రెండో జేమ్స్ 3) ఐదో కింగ్ జార్జి
    4) మొదటి చార్లెస్
12. పీష్వా పదవిని లార్డ్ హేస్టింగ్స్ ఏ సంవత్సరంలో రద్దు చేశాడు?
    1) 1806 2) 1816
    3) 1818 4) 1822
13. ఆంధ్రలో ఉప్పుసత్యాగ్రహంలో అరెస్టయిన తొలి మహిళ ఎవరు?
    1) దుర్గాబాయి దేశ్‌ముఖ్
    2) మాగంటి అన్నపూర్ణమ్మ
    3) ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి
    4) యామినీ పూర్ణతిలకం
14. కింది వారిలో 'బొబ్బిలి యుద్ధం'తో సంబంధం లేని వారు?
    1) తాండ్ర పాపారాయుడు
    2) విజయరామరాజు
    3) బుస్సీ 4) రాబర్ట్ క్లైవ్
15. జైలులో ఉండి ఐఎన్‌సీ అధ్యక్షుడిగా ఎన్నికైన వారెవరు?
    1) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    2) ఎ.సి. మజుందార్
    3) మోతీలాల్ నెహ్రూ
    4) చిత్తరంజన్ దాస్
16. బాలశాస్త్రి జంబేకర్ స్థాపించిన పత్రిక ఏది?
    1) వృత్తాంతిని 2) దిగ్దర్శన్
    3) సోంప్రకాశ్ 4) వేద ప్రకాశ్
17. ఆచార్య వినోబాభావే భూదానోద్యమాన్ని పోచంపల్లిలో ఏ తేదీన నిర్వహించారు?
    1) 1950 ఏప్రిల్ 18
    2) 1951 మే 16
    3) 1950 మే 16
    4) 1951 ఏప్రిల్ 18
18. గాంధీ–ఇర్విన్ ఒప్పందం (1931 మార్చి 5) ఎక్కడ జరిగింది?
    1) వారణాసి 2) పూనా
    3) వార్ధా 4) ఢిల్లీ
19. 'రాజసౌధముల నగరం' అని దేన్ని పిలిచేవారు?
    1) ఉదయ్‌పూర్ 2) బొంబాయి
    3) జైపూర్ 4) కలకత్తా
20. హైదరాబాద్‌లో ఏర్పడిన తొలి ప్రజా ప్రభుత్వంలో హోంశాఖ మంత్రి ఎవరు?
    1) మెహదీ నవాజ్‌జంగ్
    2) వినాయకరావు కొరాట్కర్
    3) దిగంబరరావు బిందూ
    4) జి.ఎస్. మేల్కోటి
21. 1792లో మొక్కలు నాటే శిక్ష విధించిన పాలకుడెవరు?
    1) హైదరాలీ 2) టిప్పు సుల్తాన్
    3) నిజాం అలీఖాన్ 4) సలాబత్ జంగ్
22. వందేమాతరం ఉద్యమ సమయంలో, 1907లో మద్రాస్ కేంద్రంగా ప్రారంభమైన బ్యాంక్ ఏది?
    1) యూకో బ్యాంక్
    2) ఆంధ్రా బ్యాంక్ 3) ఇండియన్ బ్యాంక్
    4) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
23. సర్ థామస్ మన్రో ఎక్కడ మరణించాడు?
    1) ఆధోని 2) ముండ్లపాడు
    3) లక్కిరెడ్డిపల్లి 4) పత్తికొండ
24. 'స్వరాజ్' అనే మాటను ఏ ఐఎన్‌సీలో మొదటగా ఉపయోగించారు?
    1) 1906 2) 1908
    3) 1909 4) 1910
25. 'యంగ్ బెంగాల్ ఉద్యమం' ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
    1) 1824 2) 1826
    3) 1828 4) 1832
26. కింది వారిలో 'మహర్షి' అనేది ఎవరి బిరుదు?
    1) మోతీలాల్ నెహ్రూ
    2) బులుసు సాంబమూర్తి
    3) సి. రాజగోపాలాచారి
    4) సి.ఆర్. దాస్
27. 'బెంగాల్ టైగర్' అని ఎవరిని పిలిచేవారు?
    1) రాబర్ట్ క్లైవ్
    2) లార్డ్ కారన్‌వాలిస్
    3) లార్డ్ జార్జ్ బార్లో 4) లార్డ్ వెల్లస్లీ
28. 1773 రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరిస్తూ చేసిన చట్టం ఏది?
    1) 1813 చార్టర్ చట్టం
    2) 1833 చార్టర్ చట్టం
    3) 1781 జుడికేచర్ చట్టం
    4) 1793 చార్టర్ చట్టం
29. అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా కర్సన్ దాస్ ముల్జీ ఏ రాష్ట్రంలో పోరాటం చేశాడు?
    1) ఒడిశా 2) గుజరాత్
    3) మహారాష్ట్ర 4) బెంగాల్
30. తీర్థయాత్రలపై పన్ను రద్దు చేసిన గవర్నర్ జనరల్ ఎవరు?
    1) మెట్కాఫ్ 2) ఆక్లాండ్
    3) ఎలెన్‌బరో 4) డల్హౌసీ
31. భారతదేశంలో 'విప్లవాల కేంద్రం' అని పిలిచే ప్రాంతం ఏది?
    1) దండి 2) చంపారన్
    3) మీరట్ 4) కాన్పూర్
32. 'షాబందర్' అధికారి విధి?
    1) అంతఃపుర విషయాలు
    2) విద్యా విషయాలు
    3) ఓడరేవు విషయాలు
    4) యుద్ధ విషయాలు
33. ఫ్రెంచ్‌వారు భారతదేశాన్ని ఏ సంవత్సరంలో వదిలి వెళ్లిపోయారు?
    1) 1954 2) 1959
    3) 1961 4) 1962
34. శిశిరకుమార్ ఘోష్ 'అమృతబజార్' పత్రికను ఎక్కడ నుంచి ప్రచురించారు?
    1) కలకత్తా 2) మద్రాస్
    3) బొంబాయి 4) కాన్పూర్
35. యుద్ధాల్లో మరణించిన లేదా అంగవైకల్యం పొందిన బ్రిటిష్ సైనికుల సహాయార్థం ఏర్పాటు చేసిన నిధి?
    1) వెల్లస్లీ నిధి
    2) బెంటింక్ నిధి 3) మెట్కాఫ్ నిధి
    4) క్లైవ్ నిధి
36. పూనా ఒప్పందం అంటే..?
    1) షెడ్యూల్ కులాల వారి నియోజకవర్గాల్లో మార్పులు చేయకపోవడం
    2) షెడ్యూల్ కులాల వారి నియోజకవర్గాలను జనరల్‌గా మార్పు చేయడం
    3) జనరల్ నియోజకవర్గాల్లో కొన్నింటిని షెడ్యూల్ కులాల వారికి కేటాయింపు
    4) షెడ్యూల్ కులాల వారికి కేటాయించిన నియోజకవర్గాలను పూర్తిగా రద్దు చేయడం
37. కింది వాటిలో సరైన జత ఏది?
    1) యానాం – ఫ్రెంచ్
    2) గోవా – పోర్చుగీసు
    3) పులికాట్ – డచ్చి
    4) పైవన్నీ సరైనవే
38. స్వతంత్ర భారతదేశ తొలి గవర్నర్ జనరల్ ఎవరు?
    1) సి. రాజగోపాలాచారి
    2) లార్డ్ మౌంట్‌బాటెన్
    3) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    4) కె.ఎం. ఫణిక్కర్
39. వాస్కోడిగామాకు సమకాలీనుడైన ఢిల్లీ సుల్తాన్ ఎవరు?
    1) ఖిజిర్‌ఖాన్ 2) ముబారక్‌షా
    3) సికిందర్ లోడి 4) ఇబ్రహీం లోడి
40. దాదాభాయ్ నౌరోజీ ఇంగ్లండ్‌లో స్థాపించిన సంస్థ ఏది?
    1) ది లండన్ ఇండియన్ సొసైటీ
    2) ఇండియన్ అసోసియేషన్
    3) ఇండియన్ పేట్రియాట్స్ సొసైటీ
    4) లండన్ పార్సీ సొసైటీ
41. అనిబిసెంట్ 'దివ్యజ్ఞాన సమాజ ప్రతినిధురాలి'గా ఏ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టారు?
    1) 1905 2) 1907
    3) 1910 4) 1912
42. 'పాలేరు' అనే నాటకం రాసిందెవరు?
    1) ఎండ్లూరి సుధాకర్
    2) కత్తి పద్మారావు
    3) బొజ్జా తారకం
    4) బోయి భీమన్న
43. ఉప్పు తయారీ, అమ్మకాలపై గుత్తాధిపత్యం పొందిన తొలి విదేశీయులు ఎవరు?
    1) పోర్చుగీసువారు
    2) డచ్చివారు 3) బ్రిటిషర్లు
    4) ఫ్రెంచ్‌వారు
44. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) ప్రపుల్ల చంద్రరాయ్ – బెంగాల్ కెమికల్ ఫ్యాక్టరీ
    2) కామన్‌వీల్ పత్రిక – అనిబిసెంట్
    3) ప్రాచ్య కళల అధ్యయనం కేంద్రం – అవనీంద్రనాథ్ ఠాగూర్
    4) రిప్పన్ కళాశాల స్థాపన – డబ్ల్యు.సి. బెనర్జీ
45. పోర్చుగీసువారితో పాటు క్రైస్తవ మత ప్రచారం కోసం భారత్ వచ్చిన వారెవరు?
    1) హ్యూజినాట్స్
    2) ప్యూరిటన్లు 3) టాబరెట్లు
    4) జెస్యూట్లు
46. మైఖేల్ మధుసూదన్ దత్ ఏ భాషలో కవిత్వాన్ని వెలువరించారు?
    1) కన్నడ
    2) బెంగాలీ
    3) పంజాబీ
    4) ఒరియా
47. ఇంగ్లిష్‌వారిపై జిజియా పన్ను విధించిన మొగల్ రాజెవరు?
    1) మొదటి షా ఆలం
    2) బహదూర్‌షా జాఫర్
    3) ఔరంగజేబు
    4) షాజహాన్
48. 'అమర్ సోనార్ బంగ్లా...' గీతాన్ని రాసిన వారెవరు?
    1) మైఖేల్ మధుసూదన్ దత్
    2) ముల్కరాజ్ ఆనంద్
    3) దీనబంధు మిత్ర
    4) రవీంద్రనాథ్ ఠాగూర్
49. ఇంగ్లండ్‌లో ఉన్న 'ఇండియన్ హౌస్' ఎవరి కార్యాలయం పేరు ?
    1) ఎస్.ఎ. డాంగే 2) వి.డి. సావర్కర్
    3) దాదాభాయ్ నౌరోజీ
    4) శ్యాంజీ కృష్ణవర్మ
50. 1930లో 'ముస్లిం లీగ్' వార్షిక సమావేశం ఎక్కడ జరిగింది?
    1) పాట్నా 2) అలహాబాద్
    3) లాహోర్ 4) ఢాకా
51. 'కలకత్తా చీకటి గది' ఉదంతంనాటి (1756 జూన్ 20) బెంగాల్ గవర్నర్ ఎవరు?
    1) వన్సిట్టార్ 2) రాబర్ట్ క్లైవ్
    3) వాట్సన్ 4) డ్రేక్
52. కింది వాటిలో సరైన జత ఏది?
    1) రామ్‌గఢ్ ఐఎన్‌సీ – 1940
    2) సేనాపతి బాపట్ – అభినవ భారత్
    3) ఓరుగంటి వెంకటసుబ్బయ్య – పల్లిపాడు ఆశ్రమం
    4) పైవన్నీ సరైనవే
53. బక్సార్ యుద్ధం ఏ తేదీన జరిగింది?
    1) 1764 అక్టోబర్ 22
    2) 1791 నవంబర్ 16
    3) 1757 ఆగస్టు 12
    4) 1765 జూన్ 20
54. సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో ఇంగ్లండ్ ప్రధానమంత్రి ఎవరు?
    1) రామ్సేమాక్ డోనాల్డ్
    2) లాయిడ్ జార్జి 3) గ్లాడ్‌స్టోన్
    4) స్టాన్లీ బాల్డ్విన్
55. శ్రీపాద అమృతడాంగే ప్రచురించిన పత్రిక ఏది?
    1) లాంగల్ 2) ది సోషలిస్ట్
    3) ధూమకేతు 4) ఆత్మశక్తి

సమాధానాలు

1) 4	2) 3	3) 1	4) 1	5) 4
6) 2	7) 1	8) 2	9) 1	10) 2
11) 3	12) 3	13) 3	14) 4	15) 4
16) 2	17) 4	18) 4	19) 4	20) 3
21) 2	22) 3	23) 4	24) 1	25) 1
26) 2	27) 4	28) 3	29) 2	30) 2
31) 4	32) 3	33) 1	34) 1	35) 4
36) 3	37) 4	38) 2	39) 3	40) 1
41) 2	42) 4	43) 1	44) 4	45) 4
46) 2	47) 3	48) 4	49) 4	50) 2
51) 4	52) 4	53) 1	54) 2	55) 2

What is the average speed of..



B. Ravipal Reddy
Director, SIGMA, Hyderabad.

TIME AND DISTANCE

"Time and Distance" is important topic for bank exams and other competitive exams. Here formulas, units and unit's conversion are important topics.

1. **Formulas**
   The sound system in cinema theatre is 'DTS'. It is very is to remember.
   D = T × S
   $T = \frac{D}{S}$; $S = \frac{D}{T}$
   D- Distance; T- Time, S-Speed
2. **Units**
   If Distance in km and Time in hours then Speed should be in: km/hr
   If Distance in meters and Time in sec. then Speed should be in: m/sec
3. **Units conversion**
   1 km = 1000 m
   1 hr = 3600 sec
   To convert speed from km/hr to m/sec, multiply by $\frac{5}{18}$
   To convert speed from m/sec to km/hr, multiply by $\frac{18}{5}$
4. If a person travelled two equal distances at '*x*' km/hr and '*y*' km/hr, then his average speed $= \frac{2xy}{x+y}$
5. If a person travelled three equal distances at '*x*' km/hr, '*y*' km/hr and '*z*' km/hr, then his average speed $= \frac{3xyz}{xy+yz+zx}$
6. If a person travelled two or more than two equal or unequal distances with different speeds, then his average speed $= \frac{\text{Total distance}}{\text{Total time}}$
7. If two persons A and B start at the same time from two points P and Q towards each other and after crossing they take T_1 and T_2 hours in reaching Q and P respectively, then
   A's Speed : B's Speed $= \sqrt{T_2} : \sqrt{T_1}$
8. If the time taken is constant, the distance travelled is proportional to the speed, that is, more the speed more the distance travelled in the same time.
9. If the speed is constant, the distance travelled is proportional to the time taken, that is, more the distance travelled, more the time taken at the same speed.
10. If the distance travelled is constant, the speed is inversely proportional to the time taken, that is , more the speed, less the time taken for the same distance travelled.

EXAMPLES

BANK
POs, Clerks
Special
Quantitative Aptitude

1. A car covers a distance of 816 km in 12 hours. What is the speed of the car?
   1) 60 km/hr 2) 62 km/hr
   3) 64 km/hr 4) Can't be determined
   5) None of these

Sol: Speed $= \frac{816}{12}$ =68 km/ hr *Ans: 5*

2. A car travels a distance of 75 km at the speed of 25 km/hr. It covers the next 25 km of its journey at the speed of 5 km/hr and the last 50 km of its journey at the speed of 25 km/hr. What is the average speed of the car?
   1) 40 km/hr 2) 25 km/hr
   3) 15 km/hr 4) 12.5 km/hr
   5) None of these

Sol: Time taken to cover first 75 km of distance $= \frac{75}{25} = 3$ hrs
Time taken to cover next 25 km of distance $= \frac{25}{5} = 5$ hrs
Time taken to cover last 50 km of its journey $= \frac{50}{25} = 2$ hrs
Average Speed $= \frac{\text{Total distance}}{\text{Total time}}$
$= \frac{75+25+50}{3+5+2}$
$= \frac{150}{10} = 15$ km/hr *Ans: 3*

3. The speed of truck is $\frac{1}{3}^{rd}$ of the speed of a train. The train covers 1230 km in 5 hours. What is the speed of the truck?
   1) 85 km/hr 2) 82 km/hr
   3) 81 km/hr 4) 87 km/hr
   5) None of these

Sol: The speed of the train $= \frac{1230}{5} = 246$ km/hr
The speed of the truck
$= \frac{1}{3} \times 246 = 82$ km / hr *Ans: 2*

4. The average speed of a bus is 2½ times the average speed of a tractor. The tractor covers 336 km in 21 hours. How much distance will the bus cover in 12 hours?
   1) 380 km 2) 440 km
   3) 360 km 4) 460 km
   5) None of these

Sol: The speed of the tractor $= \frac{336}{21} = 16$ km/hr
The speed of the bus
$= \frac{5}{2} \times 16 = 40$km/hr
The bus covered distance in 12 hours = 12 × 40 = 480 km
Ans: 5

5. A man walks at the speed of 4 km/hr and runs at the speed of 8 km/hr. How much time will the man require to cover a distance of 24 km, if he completes half of his journey (12 km) walking and half of his journey running?
   1) 3 hours 2) 6 hours
   3) 12 hours 4) 5 hours
   5) None of these

Sol: The time of first half of his journey $= \frac{12}{4} = 3$ hours
The time of second half of his journey $= \frac{12}{8} = 1\frac{1}{2}$ hours
The time for total journey
$= 3 + 1\frac{1}{2} = 4\frac{1}{2}$ hours
Ans: 5

6. What is the respective ratio between the speed of train and speed of a car, if the car covered 364 km in 7 hours and the train covered 195 km in 3 hours?
   1) 5 : 4 2) 4 : 5
   3) 13 : 5 4) 5 : 13
   5) None of these

Sol: The required ratio
$= \frac{195}{3} : \frac{364}{7} = 65 : 52 = 5 : 4$
Ans: 1

7. A tourist bus covers a distance of 522 km at the speed of 58 km/hr in 11 hours. If the bus halted at a tourist spot in the middle of the journey, for how much time did it halt?
   1) 30 minutes 2) 1 hour
   3) 1 hr 30 minutes
   4) 2 hours
   5) None of these

Sol: The time for total journey (without halting) $= \frac{522}{58}$ =9 hours
The time for total journey (with halting) = 11 hours
The tourist bus halted time
= 11 − 9 = 2 hours
Ans: 4

Previous questions from different bank exams

1. The average speed of a bus is three-fifth of the average speed of a car which covers 3250 km in 65 hours. What is the average speed of the bus?
   1) 30 km/hr 2) 20 km/hr
   3) 35 km/hr 4) 36 km/hr
   5) None of these

Sol: The average speed of the car
$= \frac{3250}{65}$ =50 km/hr
The average speed of the bus
$= \frac{3}{5} \times 50$ =30 km/hr
Ans: 1

2. Two children A and B start running from the same points P along a circular path in opposite directions. The radius of the circular path is 14 meter. B's speed is 9 meter per minute and the two children meet each other after 4 minutes. What was A's speed in meters per minutes?
   1) 12 2) 14
   3) 11 4) 13
   5) None of these

Sol: The circumference of the circular path
$= 2\pi r = 2 \times \frac{22}{7} \times 14 = 88$ meters
Distance covered by
B = T× S = 4 × 9 = 36 meters
Remaining path to covered by A
= 88 − 36 = 52 meter
So, A covers the distance 52 meter in 4 minutes
A's speed $= \frac{52}{4} = 13$m/min. *Ans: 4*

3. A car travels a distance of 45 km at the speed of 15 km/hr. It covers the next 50 km of its journey at the speed of 25 km/hr and the last 25 km of its journey at the speed of 10 km/hr. What is the average speed of the car?
   1) 40 km/hr 2) 24 km/hr
   3) 15 km/hr 4) 18 km/hr
   5) None of these

Sol: Time for first 45 km $= \frac{45}{15}$ =3hrs
Time for next 50 km $= \frac{50}{25} = 2$ hrs
Time for last 25 km $= \frac{25}{10}$ =2.5hrs
The average speed:
$= \frac{\text{Total distance}}{\text{Total Time}}$
$\frac{45+50+25}{3+2+2.5} = \frac{120}{7.5} = 16$ km/hr
Ans: 5

4. A car reached Raipur from Somgarh in 35 minutes with an average speed of 69 km/hr. If the average speed is increased by 36 km/hr, how much time will it take to cover the same distance?
   1) 24 min. 2) 27 min.
   3) 23 min. 4) 29 min.
   5) None of these

Sol: Speed = 69 km/hr
Time = 35 minutes $= \frac{35}{60}$ hours
Distance $= \frac{35}{60} \times 69$ km/hr
Second case Speed
= 69 + 36 = 105 km/hr
Second case time
$= \frac{35}{60} \times 69 \times \frac{1}{105} = \frac{23}{60} = 23$ minutes
Ans: 3

5. A person travelled from his house to office at 15 km/hr and office to house at 60 km/hr. The time for total journey is 30 minutes. Then find the distance between house and office?
   1) 6 km 2) 12 km
   3) 18 km 4) 24 km
   5) None of these

Sol: His average speed
$= \frac{2 \times 15 \times 60}{15+60}$
$= \frac{1800}{75} = 24$ km/hr
Time = 30 minutes = ½ hr
Total distance (house to office and office to house)
= ½ × 24 = 12 km
The distance between house and office $= \frac{12}{2} = 6$ km. *Ans: 1*

6. A person travelled from house to office at 3 km/hr and reached his office 9 minutes late, next day he travelled from house to office at 4 km/hr and reached 6 minutes early. Find the distance between house and office?
   1) 3 km 2) 5 km
   3) 4 km 4) 3 ½ km
   5) None of these

Sol: 1st day:
Let Distance = *x* km
Speed = 3 km/hr
Time $= \frac{x}{3}$ hrs
2nd day:
Distance = *x* km
Speed = 4 km/hr
Time $= \frac{x}{4}$ hrs
The time difference in 2 days
= 9 + 6 = 15 minutes
$= \frac{15}{60}$ hrs = ¼ hrs
According to the question
$\frac{x}{3} - \frac{x}{4} = \frac{1}{4}$
4*x* − 3*x* = 3
x = 3 km *Ans: 1*

పూరించండి

కింద ఉన్న జంతువుల పేర్లు వాటికి ఎదురుగా ఉన్న ఖాళీలలో పూరించండి



G _ _ B _ _ _


_ O _ _ E

_ E _

R _ _ _ _ E _

_ _ _ K

దారి చూపండి..!



ఔనా!



మన కనురెప్పలపై సగటున 550 వెంట్రుకలు ఉంటాయి



ప్రాచీన ఈజిప్టులో పిల్లిని ప్రమాదవశాత్తూ చంపినా ఉరిశిక్ష విధించేవారు



చదరంగం పుట్టింది మనదేశంలోనే. కాలక్రమంలో విశ్వమంతా వ్యాప్తిచెందింది.



ప్రపంచవ్యాప్తంగా అపరిశుభ్ర నీటి కారణంగా ఏటా 34 లక్షల మంది మరణిస్తున్నారు

నాన్నా చెప్పవా?

రాబీస్ వ్యాధి కుక్కలు కరిస్తేనే వస్తుందా?



లూయిపాశ్చర్ అనే శాస్త్రవేత్త క్రీ.శ.1885లో రాబీస్ వ్యాధికి టీకా మందుని కనిపెట్టడానికి ముందు ఈ ప్రపంచాన్ని గడగడలాడించిన వ్యాధుల్లో రాబీస్ ఎన్సిఫిలిటీస్ వ్యాధి కూడా ఒకటి. ఇది ఒకానొక వైరస్ ద్వారా వస్తుంది. ఈ వైరస్‌ని కలిగి ఉండే కుక్కలు మనుషులను కరిచినప్పుడు, కొరికినప్పుడు అయిన గాయాల ద్వారా వ్యాధికి సంబంధించిన వైరస్‌లు మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఆ తరువాత గాయం ఉన్న చోట ఉండే నాడీకణాల ద్వారా కేంద్ర నాడీమండలంలోకి చేరుకుని, శరీరంలోని అన్ని నాడుల్లోకి వైరస్ వ్యాపిస్తుంది. ఆ తరువాత దాదాపుగా మన శరీరంలోని ప్రతి అవయవం పైన వైరస్ తన ప్రభావాన్ని చూపిస్తుంది. వ్యాధి ఎంత కాలానికి మొదలవుతుంది అనేది కుక్క కరిచిన ప్రదేశంపై ఆధారపడి ఉన్నప్పటికి సాధారణంగా 8 వారాలలో వ్యాధి లక్షణాలు కనిపించడం మొదలవుతాయి. కుక్క కరిచిన చోట నొప్పి, దురదతో మొదలై క్రమక్రమంగా తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి పలు దశలను దాటి, వివిధ రకాల మానసిక వైకల్యాలు, భయాలు మొదలవుతాయి. ముఖ్యంగా రాబీస్ వ్యాధి వచ్చిన వ్యక్తులు నీరన్నా, నీటి చప్పుడన్నా హడలిపోతారు. వ్యాధి బాగా ముదిరాక గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యవస్థకు పక్షపాతం వచ్చి వ్యాధిగ్రస్తుడు చనిపోతాడు. రాబీస్ వ్యాధి కుక్కల ద్వారానే కాక కోతులు, గబ్బిలాలు, రకూన్స్, నక్కలు, తోడేళ్లు, ముంగిసలు, ఇంకా ఇతర మాంసాహార వన్య ప్రాణుల ద్వారా కూడా మనుషులకు సంక్రమించవచ్చు. ఇలాంటి జంతువులు ఏవి కొరికినా వాటి ద్వారా కూడా రాబీస్‌వ్యాధి వచ్చే అవకాశం టుంది. అయితే పాములు, తాబేళ్లు, ఉడుతలు, కుందేళ్లు, తేనెటీగలు, పక్షులు వంటి కొన్ని జంతువులు మాత్రం రాబీస్ వ్యాధికారక క్రిమి వాహకాలుగా ఉండవు.

జవాబులు: Ans: gobbler, goose, hen, rooster, duck


ఈ రెండు బొమ్మల మధ్య ఉన్న 6 తేడాలను గుర్తించండి.






పక్కన ఉన్న నాలుగు నీడల్లో ఇక్కడ ఉన్న కుందేలు బొమ్మ అసలైన నీడ ఏదో గుర్తించండి.






బొమ్మను గీయండి - రంగులు వేయండి

కింద ఉన్న బొమ్మను చూసి, ఖాళీ గళ్లలో బొమ్మను అలాగే గీయండి. రంగులు వేయండి.



చుక్కలు కలపండి - రంగులు వేయండి





తైక్వాండో పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ, జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్

కడప స్పోర్ట్స్: ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలోని ఉస్టీల్ ప్లాంట్‌లో నిర్వహించిన చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఇటీవల నిర్వహించిన ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ తోటకృష్ణ, డీఎస్‌డీఓ ఎం.ఎస్.ఉమాశంకర్ అభినందించారు. ఆగస్టు 3 నుంచి 6 వరకు ఆగ్రాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. అనంతరం బంగారు పతకాలు సాధించిన జి.గురుసాయికుమార్, జి.గణేష్, ఎస్.షాహిద్‌హుస్సేన్, సాయిరాం, రజత పతకం పొందిన ఎస్.తహసీన్, కాంస్య పతకాలు కైవసం చేసుకున్న ఎస్. షాహిద్, డి.రిజ్వానా, బి.వినయ్‌బాబు, పునీత్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నాయబ్‌రసూల్, కోశాధికారి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

3న అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 3న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16, 18, 20 లోపు బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులకు 100, 400, 600, 800 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు 19, 20, 21 తేదీల్లో పట్టణంలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 9949686586కు సంప్రదించాలని కోరారు.

రాఘవరావు సేవలు మరువలేనివి



రాఘవరావును సన్మానిస్తున్న డీఆర్వో నరసింహారావు, ఏపీడీ శ్రీదేవి

కడప కోటిరెడ్డి సర్కిల్: ఐసీడీఎస్ పీడీ రాఘవరావు సేవలు మరువలేనివని ఆ శాఖ ఉద్యోగులు కొనియాడారు. రాఘవరావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి సీడీపీఓ వసంతభాయి మాట్లాడుతూ విధుల్లో రాఘవరావు నిక్కచ్చిగా ఉంటూ ఐసీడీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. డీసీపీఓ శివప్రసాద్‌రెడ్డి , ఏపీడీ శ్రీదేవి, సూపరింటెండెంట్ శివశంకర్ మాట్లాడారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి నరసింహారావు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది రాఘవరావును సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కదం తొక్కారు..!

- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కలెక్టరేట్ వద్ద ఆందోళన
- కమర్షియల్, ప్రొవిజనల్ పన్ను తగ్గించాలని డిమాండ్
- విద్యార్థి సంఘాల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని వేడుకోలు

కడప ఎడ్యుకేషన్:

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ప్రైవేటు విద్యా సంస్థల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి అన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు ఉదయాన్నే కడపకు చేరుకున్నారు. నగరంలోని జియాన్ కళాశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు జనార్ధన్ రెడ్డి, పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వేలాది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఏదైనా పొరపాటు జరిగితే.. దానికి విద్యార్థి సంఘ నాయకులు బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. చిన్న తప్పులను సైతం భూతద్దంలో చూపించి, తప్పు దారి పట్టించే కొన్ని సంఘాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలగంగయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కమర్షియల్, ప్రొవిజనల్ ట్యాక్సులు భారీగా విధిస్తోందని, తగ్గించాలని కోరారు. ఇది వరకు ఉన్న విధంగా విద్యుత్ చార్జీలను క్యాటగిరి 2 నుంచి 7కు మార్చాలన్నారు. ఫైర్ ఎన్‌ఓసీని ఏటా కాకుండా పదేళ్లకు ఒక సారి రెన్యువల్‌కు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తీసుకోబోతున్న 2017 సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ విద్యా చట్టంలో మార్పులపై విద్యావేత్తలు, సంఘాల నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు జేఏసీ నాయకులు

కలెక్టర్‌తోపాటు ఎస్పీ, డీఈఓకు వినతులు

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు అలాగే జూనియర్ కళాశాలల యాజమాన్యం కలిసి జియాన్ కళాశాల నుంచి కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ బాబూరావునాయుడు, ఎస్పీ బాపూజీ అట్టాడ, జిల్లా విద్యాశాఖాధికారిణి పొన్నతోట శైలజకు అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు ప్రైవేటు పాఠశాలల ఐక్య వేదిక నాయకులు రమేష్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, రాజారెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాలల జేఏసీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, సురేష్‌బాబు, అక్బర్‌ఖాన్, శ్రీహరిసుబ్బారెడ్డి, అనంతపురం జిల్లా నాయకులు రామిరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న జేఏసీ నాయకులు

పీఎం సహాయ నిధి నుంచి

రూ.19.65 లక్షల మంజూరు



చొరవ చూపిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి 10 మంది బాధితులకు రూ.19.65 లక్షలు మంజూరయ్యాయి. రాయచోటి బేతాల కాలనీకి చెందిన ఎస్.అమర్‌నాథ్‌రెడ్డికి లివర్ మార్పిడి కోసం రూ.3 లక్ష్షలు, పెనగలూరుకు చెందిన హేమలతకు కిడ్నీ మార్పిడికి రూ.3 లక్షలు, పుల్లంపేట చిన్నారి వై. ధనుష్‌కుమార్‌రెడ్డికి కాక్లియర్ ఇంప్లాంటేషన్‌కు రూ.2,85,500 మంజూరైంది. అలాగే చిత్తూరు జిల్లాలో కురబాలకొండ మండలం మాదిరెడ్డిపల్లెకు చెందిన బి.చంద్రశేఖర్ గుండె ఆపరేషన్‌కు రూ.50 వేలు, తిరుపతిలోని పూలవారిగుంటకు చెందిన కె.స్వాతి గుండె ఆపరేషన్‌కు రూ.50 వేలు, పీలేరు చిన్నారి బి.ధనశ్రీకి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీకి రూ.3 లక్షలు, పుంగనూరు మండలం నెల్లూరిపల్లెకు చెందిన చిన్నారి మహీధర్‌రెడ్డికి కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీకి రూ.3 లక్షలు, గుర్రంకొండ మండలం కొత్తపేటకు చెందిన ఎస్.నజీర్‌అహ్మద్‌కు రూ.30 వేలు, ఎర్రవారిపాలెం ఎల్లమండకు చెందిన రాజేష్‌కుమార్‌రెడ్డికి రూ.50 వేలు, తంబళ్లపల్లికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డికి అప్లాస్టిక్ అనీమియాకు చికిత్స తీసుకోవడానికి రూ.3 లక్షలు మంజూరు చేశారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం ఇప్పించిన ఎంపీ మిథున్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కుదుట పడుతున్న సుధీర్‌రెడ్డి ఆరోగ్యం



డాక్టర్ సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న నేతలు, ప్రజలు

ఎర్రగుంట్ల: జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆరోగ్యం కుదుట పడుతోంది. ఆయన ఆదివారం ఎర్రగుంట్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గంమధ్యలో కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విషయం తెలిసిందే. సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చేతికి గాయం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆయనను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు.

ఆస్పత్రికి వచ్చిన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సతీసమేతంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ముద్దనూరు మాజీ ఎంపీపీ మునిరాజరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

కొడుకు అన్నం పెట్టలేదు..



ఉన్న ఒక్కగానొక్క కుమారుడు అన్నం పెట్టలేదు. వయస్సులో ఉన్నప్పుడు పొలం పనులు చేశా. గొర్రెలను కాశాను. ఇప్పుడు పనిచేయలేకపోవడంతో కొడుకు వదిలేశాడు. వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించా. ఇక్కడ చేతనైన పనిచేస్తా. పండ్లు, కూరగాయలు పండిస్తాం. మే మే భుజిస్తాం. ఇక్కడ మాకు ఎలాంటి చీకు చింత లేదు.

- గంగన్న(వృద్ధుడు), గంగనపల్లె



వృద్ధాశ్రమంలో ప్రశాంతంగా ఉంది..



నాకు కుమారులు లేరు. కుమార్తెలకు వివాహమైంది. పట్టెడన్నం పెట్టే దిక్కులేదు. అలాంటి పరిస్థితులలో వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించా. ఇక్కడ ప్రశాంతంగా ఉంది.

- లక్షుమ్మ, వృద్ధురాలు , జమ్మలమడుగు

కుటుంబం కోసం.. బిడ్డల కోసం.. వారి ఉన్నతి కోసం ఎంతో కష్టపడ్డారు.. పిల్లల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతం కృషి చేశారు.. ఇప్పుడు జీవిత చరమాంకంలో ఉన్నారు.. వృద్ధాప్యంతో బాధపడుతున్నారు. అయితే ఆప్యా యంగా చూసుకోవాల్సిన బిడ్డలు పట్టించుకోవడం లేదు.. పట్టెడన్నం పెట్టడం లేదు.. ఆత్మీయంగా మాట్లాడడం లేదు.. కన్నబిడ్డల నిరాదరణకు గురైనవారు లీలావతి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు.

వృద్ధుల పాలిట... ఆత్మీయ హస్తం

- కన్నబిడ్డల నిరాదరణకు గురైన వృద్ధులను ఆదరిస్తున్న లీలావతి వృద్ధాశ్రమం
- నేడు 8వ వార్షికోత్సవం

లింగాల :

లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో వెలసిన లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం పండుటాకులను అక్కున చేర్చుకుంటోంది. బిడ్డలకు భారమై వదిలేసిన అనాథ వృద్ధులకు నేనున్నానంటూ లీలావతి చారిటబుల్ ట్రస్ట్ ఆదరిస్తోంది. వారి ఆలనా పాలనా చూస్తోంది. ఊరు బయట ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ వృద్ధాశ్రమం 8 ఏళ్లు పూర్తి చేసుకుంది. కన్నబిడ్డల నిరాదరణకు గురైనవారు ఇక్కడ సేదదీరుతున్నారు.

దాతల విరాళాలతో మంచి భోజనాలు :

లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి దాతలు విరాళాలు విరివిగా అందిస్తున్నారు. అన్నదానాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులకు మూడు పూటలా శుచి, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

కూరగాయల తోటలసాగు ..

వృద్ధాశ్రమానికి రెండు ఎకరాల భూమి ఉంది. ఆ పొలంలో వృద్ధులు కూరగాయలు పండిస్తున్నారు. గోంగూర, టమోట, బెండ, వంగ, పాల కూర తదితర కూరగాయలేగాక మామిడి, అల్లనేరేడు, పనస, జామ, ఉసిరి పండ్ల చెట్లను పెంచారు.

ఆహ్లాదకర వాతావరణం.. :

వృద్ధాశ్రమం చుట్టూ పచ్చదనం పరుచుకుంది. వేప, నీలగిరి, కొబ్బరి చెట్లతోపాటు వివిధ రకాల పూల మొక్కలతో పచ్చదనం పరుచుకొని ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

నేడు వార్షికోత్సవం.. :

ఆగస్ట్ 1వ తేదీన 8వ వార్షికోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు, రాజకీయ, ఉద్యోగ ప్రముఖులు వార్షికోత్సవంలో పాల్గొంటారు. అదేవిధంగా రెడ్ క్రాస్‌సొసైటీ, పులివెందుల బ్లడ్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.



లీలావతి ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు



వృద్ధాశ్రమం ఆవరణంలో పరుచుకున్న పచ్చదనం

వృద్ధులను బాగా చూసుకుంటున్నాం..



వృద్ధాశ్రమంలోని వృద్ధులను బాగా చూసుకుంటున్నాం. అనారోగ్య పరిస్థితి ఏర్పడినా ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాం. దాతల విరాళాలతో వృద్ధులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నాం. ప్రత్యేక మంచాలు, పరుపులు, దోమ తెరలు ఏర్పాటు చేశాం. కాలక్షేపానికి టీవీ అమర్చాం.

- ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి(ట్రస్ట్ వ్యవస్థాపకులు), చిన్నరంగాపురం



నాగనాథీశ్వరుని కొండకు వచ్చే రహదారి ఇదే..



కొండ పైనుంచి భూమికి తివాచీ పరచినట్లు ఉండే పంటలు

ఆహ్లాదభరితం..

నాగనాథీశ్వర కోన

ప్రకృతి అందానికి నాగనాథీశ్వర కొండ నిదర్శనం. కొండ పై నుంచి చూస్తే చుట్టూ పచ్చని పంట పొలాలు భూమికి పచ్చని తివాచీ పరచినట్లుగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షం వల్ల కొండ అంతా పచ్చని మొక్కల తో ఆహ్లాదభరితంగా ఉంది. కొండకు వచ్చే దారి కూడా పచ్చని చెట్ల మధ్య ఆకర్శనీయంగా ఉంది. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు కనువిందు చేసే ప్రకృతిని చూసి ఆహ్లాదం పొందుతున్నారు. - ఖాజీపేట



పచ్చని నాగనాథీశ్వరుని కొండ

ఫొటోసాక్షి

డేంజర్ జర్నీ

- పట్టుజారిందా.. అంతే
- పుట్‌బోర్డుల్లో విద్యార్థుల జీవితాలు
- ఇదీ మన దుస్థితి

కడప అర్బన్ :

ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సులను నడపుతాం. రద్దీని బట్టి బస్సులను పెంచుతాం అంటూ సమావేశాల్లో గొప్పగా చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కడప రీజనల్ వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు తమ గ్రామం సమీపంలోని బస్‌స్టాప్‌ల నుంచి ఎంతో ప్రయాసతో తమ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ సమయాల్లో వారు ప్రయాణిస్తున్న బస్సుల్లో రద్దీ ఎక్కువ అవుతున్న కొద్దీ, పుట్ బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోంది.

- జిల్లాలో నలుమూలల నుంచి మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, బద్వేల్, జమ్మలమడుగు, కమలాపురం, వేంపల్లె, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల నుంచి కడపకు ఉదయం 7 :30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు వారి సౌకర్యాన్ని బట్టి ఆయా విద్యాసంస్థల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు, అదే సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలోనే బస్సు సర్వీస్‌లను పెంచాల్సి వుంది.
- కడప రీజనల్ పరిధిలో ఏపీఎస్ ఆర్టీసీ వారు గత ఏడాది 577 ఆర్టీసీ, 296 అద్దె బస్సులను నడిపారు. ఈ ఏడాది 554 ఆర్టీసీ బస్సులను 504 షెడ్యూల్స్, 293 అద్దె బస్సులను నడపుతున్నారు. దీంతో దాదాపు 76 బస్సులను రద్దు చేసినట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- జిల్లాలోని వివిధ బస్సుల ద్వారా దాదాపు మూడు లక్షల కిలోమీటర్లు మేరకు 30 వేల మంది ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. రోడ్డు భద్రత స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు, రవాణా అధికారుల సాయం కూడా తీసుకున్నారు. ఏప్రిల్ నుంచి జూన్ చివరి వరకు కడప రీజనల్ పరిధిలో నష్టాల కన్నా ఆదాయం పొందారు. దాడుల నేపథ్యంలో పోలీసు, రవాణా అధికారులు కూడా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలను సంపాదించి పెట్టారు.







రోజూ ఇవే అవస్థలు.. కడప నగరంలో పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

- విద్యార్థులకు ఉచిత, రాయితీలతో కూడిన బస్సు పాస్‌లను కూడా జిల్లా వ్యాప్తంగా 30 వేలకు పైగా మంజూరు చేశామనీ చెబుతున్నారు. ఐతే వారు విద్యాసంస్థలకు వెళ్లే సమయంలో మాత్రం ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నప్పటికీ చూసీ, చూడనట్లు వ్యవహరిస్తున్నారనీ విమర్శలు గుప్పుమంటున్నాయి.
- కొన్ని రూట్లలో విద్యార్థులు వచ్చి గంటల తరబడి బస్‌స్టాప్‌లలో వేచి వున్నప్పటికీ తాము వెళ్లాల్సిన బస్సులు వచ్చినపుడు మాత్రం ఆపకుండానే నిర్లక్ష్యంగా వెళ్లి పోవడం, విద్యార్థులు ధర్నాలు చేస్తే గానీ ప్రయోజనం లేకుండా పోతోందనీ ఆందోళనల ద్వారా తెలుస్తోంది.
- కొంతమంది విద్యార్థులు బస్సులను ఎక్కినప్పటి నుంచి దిగేవరకు ప్రాణాలను సైతం గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోందనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల ఫుట్‌బోర్డ్ ప్రయాణం

రూట్లలో పరిశీలించి బస్సు సర్వీస్‌లను పెంచుతాం

కడప రీజనల్ పరిధిలో 8 డిపోల వారీగా విద్యార్థులు, ఉద్యోగుల రద్దీ సాధారణంగా ఉదయం, సాయంత్రం ఉంటుందనీ, ఆయా ప్రాంతాల్లో బస్ స్టాప్ కేంద్రాలను తమ సిబ్బందితో స్వయంగా పరిశీలించి త్వరలో బస్సు సర్వీస్‌లను పెంచుతాం. విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.


- కిషోర్, డెప్యూటీ సీటీఎం, ఏపీఎస్ ఆర్టీసీ, కడప.

జయహో... భారత్...

పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాల లోని కొందరు విద్యార్థులు బంకమట్టితో సోమవారం భారత దేశం, వాటి భౌగోళిక స్వరూపాల నమూనాను తయారుచేశారు. తోటి విద్యార్థులకు భారతదేశంలోని వివిధ రకాల పర్వతాలు, నదులు గురించి అవగాహన కల్పించారు. సృజనకు పదునుపెట్టి నమూనా తయారుచేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ మైఖేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

- పుల్లంపేట





నమో... నారసింహా..



ప్రొద్దుటూరు మండలం నరసింహాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదిన సందర్భంగా విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేసి నూతన పట్టువస్త్రాలతో, ఆభరణాలతో, గజమాలలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కడప దత్తపీఠం భక్తులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. - పొద్దుటూరు కల్చరల్